జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 8 పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2012



మహాత్మ జ్యోతిబాపూలే



డా॥ బి.ఆర్. అంబేద్కర్



బాబు జగ్జీవన్‌రామ్

## ఆశయసాధనే నిజమైన నివాళి

## దామాషా పద్ధతి ఎన్నికలే మేలు



రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ సమావేశం .....



జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా.....



విశాఖపట్నంలో అఖిలపక్ష ధర్నా



గొడిసెలపల్లిలో ప్రజలతో ముఖాముఖి



దామాషా పద్ధతి ఎన్నికల విధానంపై ఏకాభిప్రాయం కోసం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డితో డా॥ జేపీ



డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా.....

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2012

సంపుటి - 3 సంచిక - 8

## లోపలి పేజీల్లో...

దామాషా పద్ధతి ఎన్నికలే మేలు.......... 5
రాజకీయాల తీరు మార్చాలి................ 8
అవినీతి అంతమవ్వక తప్పదు............. 9
భూపందేరాలపై 'కాగ్' నివేదిక............ 12
స్థానిక ప్రభుత్వాలే మేలు..................... 17
ఒక జాగీర్దారు కథ............................ 18
వివాహ నమోదు తప్పనిసరి............... 20
అంగన్‌వాడీల తీరు అధ్వానం.............. 22
ఇక నగర భారతమే............................ 24
దాశరథి - జ్వాలాతోరణమాల............ 26
ప్రస్తుత రాజకీయ సంస్కృతి................ 28
ఆడపిల్ల అంటే వివక్ష ఎందుకు?............ 31
జిల్లాల సమాచారం........................... 33

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# నిజమైన నివాళి

## సంపాదకీయం

దళిత, బడుగు బలహీన వర్గాల విముక్తి కోరేవారికి ఏప్రియల్ నెల చాలా ముఖ్యమైనది. "సామాజిక విప్లవోద్యమ పిత" మహాత్మాజ్యోతిపూలే (ఏప్రిల్ 11) భారత రాజ్యాంగ నిర్మాత, దళితులకు రాజ్యాధికారాన్ని రిజర్వేషన్ల ద్వారా దరికి చేర్చిన మహానుభావుడు డా॥బాబాసాహెబ్ అంబేద్కర్, (ఏప్రిల్ 14) దళిత జనోద్ధరణకు రాజ్యవ్యవస్థను వినియోగించిన బాబూ జగజ్జీవన్ రామ్ (ఏప్రిల్ 5) జన్మించిన నెల వ్యవస్థకు నమ్మకాలను సమూలంగా నిర్మూలించాలనే నినాదాన్ని జోతిబాపూలే ఇచ్చారు. అంతేకాకుండా స్త్రీలు, కార్మికులు, కర్షకులు, కర్షకులు ఎలా అణచివేయబడుతున్నారో, ఎలా దోపిడికి గురౌతున్నారో చెప్పి వాటికి పరిష్కారమార్గాలు చూపి ప్రతిఘటించమన్నారాయన. సామాజిక న్యాయం, సాంఘిక సమానత్వం, జ్ఞానం ద్వారా దళితజనోద్ధరణ జరుగుతుందన్నారు. దళితులకు, పేదలకు, బలహీనవర్గాలకు, స్త్రీలకు ఒక తాత్విక పునాదినిచ్చి, మార్పులకు ఒక బలీయమైన చోదకశక్తిగా వారిని జోతిబాపూలే ఆనాడే గుర్తించారు. జ్యోతిబాపూలే తర్వాత అదే భావజాలం నుంచి రాజకీయ తాత్విక సిద్ధాంతకర్త, ఆలోచనాశీలి, ఆచరణవాది, రాజకీయాలలో దళితులు, బలహీనవర్గాల ప్రాతినిధ్యం వుండాలని గుర్తించి ఆ దిశగా రాజ్యాంగాన్ని మలచిన మహానుభావుడు బి.ఆర్.అంబేద్కర్.

వీరే కాకుండా తమిళనాడులో పెరియర్ రామస్వామి నాయకర్, కేరళలో నారాయణగురు దళిత జనోద్ధరణకు నడుం కట్టి వారి ఆత్మగౌరవం కోసం పాటుపడిన వారే. జాతీయోద్యమ ఆదర్శాలలో హరిజనోద్ధరణను ప్రధానాంశంగా చేర్చి, వారిని ప్రధాన జీవన స్రవంతిలోకి తెచ్చేందుకు పూజ్యబాపూజీ చేసిన కృషి వెలకట్టలేనిది.

పాత రాజకీయం మన గ్రామంలోని బడిని, ఆసుపత్రిని, ఉపాధిని పట్టించుకోలేదు. కొత్త రాజకీయం వీటిని పట్టించుకుంటుంది. బాగుచేస్తుంది. విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి లభిస్తే దళితుల, పేదల, బలహీన వర్గాల, స్త్రీల జీవితాలు బాగుపడతాయి. ఈ మార్పు వల్ల అత్యధిక ప్రయోజనం పొందేది వీళ్ళే. అవును అందుకే మార్పు వల్ల ప్రయోజనం పొందేవారు మార్పును కోరుకోవాలి. మార్పు కోసం ఉద్యమించాలి. అందుకే వీరు ముందుగా ఏకమవ్వాలి. కొత్త రాజకీయ సంస్కృతి ద్వారా ఆ మార్పును సాధించాలి. ప్రయోజనాల్ని పొందాలి. మహాత్మాజ్యోతిబాపూలే, డా॥బి.ఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి సాంఘిక విప్లవకారుల స్ఫూర్తితో, దళిత బడుగు బలహీన వర్గాలు కొత్త రాజకీయ సంస్కృతికై ఉద్యమించాలి. అదే నేటి అజెండా కావాలి.

మహాత్ముల జయంతులు, వర్ధంతులు జరపడం తంతుగా మారింది. విగ్రహాలకైతే కొదవేలేదు. కాని ఈ మహనీయుల ఆశయ సాధనకు ప్రభుత్వాలు, సభ్యసమాజం పూనుకున్న రోజు వారికి మనం అర్పించే నిజమైన నివాళి అవుతుంది. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. **10** ,
ఏడాది చందా : రు. **200**
మూడేళ్ళ చందా : రు. **500**

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

## ఎన్నికల వ్యవస్థలో అరకొర మార్పులు - చిల్లర సంస్కరణల కంటే

# దామాషా పద్ధతి ఎన్నికలే మేలు

- డి.వి.వి.యస్. వర్మ

బలమైన లోక్‌పాల్ కోసం దేశంలో సాగిన చర్చ ఇప్పుడు ఎన్నికల సంస్కరణల మీద చర్చలు దారితీయడం ఒక మంచి పరిణామం. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో దశాబ్దాల తరబడి ఉద్యమాలు సాగుతున్నాయి. ఈ ఉద్యమాలు నిర్వహిస్తున్న వివిధ స్రవంతులు ప్రజాచైతన్యాన్ని పెంచుతూవచ్చాయి. ఇటీవల ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం ఒక కొత్త దశకు చేరింది. అవినీతికి అడ్డుకట్ట వేసే బలమైన లోక్‌పాల్ చుట్టూ ఈ ప్రజాభిప్రాయం సమీకృతం అయింది. అన్నాహజారే దీక్ష దీని వ్యక్తీకరణ సాధన అయింది. ఇప్పుడు బలమైన లోక్‌పాల్ చట్టం సాధించడానికి మార్గం సుగమం అయింది.

దేశంలో అవినీతి నిరోధానికి బలమైన చట్టం అవసరం. కాని అదొక్కటే సరిపోదు. కేవలం చట్టాలు మాత్రమే వ్యవస్థని పూర్తిగా చక్కదిద్దలేవు. దొంగల్ని శిక్షించడానికి చట్టాలు అవసరం. అయితే దొంగల్ని సృష్టిస్తున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థల్ని సంస్కరించకపోతే దొంగలు పుట్టుకొస్తూనే వుంటారు. దొరికినవాళ్లే దొంగలుగా శిక్షార్హులవుతారు. అవినీతి కూడా ఇలాంటిదే.

మన ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థ అవినీతి మీద మనుగడ సాగిస్తున్నది. దానిని పెంచి పోషిస్తున్నది. మన రాజకీయం ఇంతగా కుళ్లిపోవడానికి, ఇంతగా డబ్బు చుట్టూ తిరగడానికి, ఇంతగా అవినీతిమయం కావడానికి ఈ ఎన్నికల వ్యవస్థే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. మన రాజకీయ సంస్థలు ఈ ఎన్నికల వ్యవస్థని సంస్కరించకపోగా దానిలో భాగస్వామిగా మారాయి. ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లు ఖర్చుపెట్టడం అధికారంలోకి రాగానే కోట్లు దండుకునేందుకు ద్వారాలు తెరవడం అలవాటు చేసుకున్నాయి. ఈ ఎన్నికల వ్యవస్థ వికృతరూపాన్ని దీన్ని అనుసరిస్తున్న పార్టీల విశృంఖల అవినీతిని ఇప్పుడు మనం స్పష్టంగా చూస్తున్నాం. అందుచేత అవినీతి మీద జరిపే పోరాటాన్ని మరో దశకు తీసుకువెళ్లాలి. రాజకీయ అవినీతికి జన్మస్థానంగా వున్న ఎన్నికల వ్యవస్థని మార్చడానికి, అవినీతిమయమైన రాజకీయ వ్యవస్థల ప్రక్షాళనకీ ఉద్యమాన్ని నడిపించాలి.

ప్రపంచంలో ప్రధానంగా రెండు తరహాల ఎన్నికల వ్యవస్థలు వున్నాయి. ఒకటి ఫస్ట్ పాస్ ది పోస్టు (FPTP) పద్ధతి. ఇక్కడ నియోజకవర్గం ప్రాతిపదికగా వుంటుంది. గెలుపు ఓటములు నియోజకవర్గంలోనే తేలిపోతాయి. పోటీ చేసే అభ్యర్థులలో ఎవరికి ఒక ఓటు ఆధిక్యత వస్తే వారు గెల్చినట్లు మిగిలిన వారు ఓడినట్లు. ఓడిన వారికి వచ్చిన ఓట్లు అక్కడే మురిగిపోతాయి. మనదేశంలో అటు పార్లమెంటుకీ ఇటు అసెంబ్లీకి మనం అనుసరిస్తున్న ఎన్నికల పద్ధతి ఇదే. ఈ పద్ధతిలో నియోజకవర్గంలో గెలుపు ముఖ్యం గనుక కేంద్రీకరణ అంతా నియోజకవర్గం మీద, అభ్యర్థుల మీద ఆధారపడి వుంటుంది. గెలుపును అందించే ఆ ఒక్క ఓటు పొందడం కోసం ధనబలం, కండబలం, కులబలం వగైరాలన్నింటినీ కేంద్రీకరించడం జరుగుతుంది. అందువల్లనే ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడం తప్పనిసరి అయింది.

ఇక రెండవది దామాషా పద్ధతి ఎన్నిక. ఇందులో స్థూలంగా రెండు రకాలున్నాయి. చిన్న దేశాలు, తక్కువ జనాభా వున్న దేశాలలో పార్టీజాబితా పద్ధతి వుంది. ఈ పద్ధతిలో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను ముందుగా ప్రకటించి, ఎన్నికల కమిషన్‌కు అందజేస్తాయి. ఎన్నికల్లో పార్టీలకే ప్రజలు ఓట్లు వేస్తారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ దామాషాలో ఆ పార్టీకి సీట్లు వస్తాయి. పార్టీ ప్రకటించిన జాబితా వరుసక్రమంలో అభ్యర్థులు చట్టసభ సభ్యులవుతారు. ఈ పద్ధతిలో నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వుండదు.

ఇక రెండవ పద్ధతిని మిశ్రమ సభ్యత్వ దామాషా పద్ధతిగా పిలుస్తారు. ఇందులో మొత్తం చట్టసభ సభ్యుల సంఖ్యలో సగం స్థానాలు నియోజకవర్గాల నుండి గెలిచే వారికి, సగం స్థానాలు పార్టీజాబితా అభ్యర్థులకీ కేటాయిస్తారు. ఓటర్లకు రెండు ఓట్లు వుంటాయి. ఒకటి నియోజకవర్గంలో అభ్యరికి, ఒకటి పార్టీకి ఓటు చేసుకునే వీలుంటుంది. మొత్తంమీద చట్టసభలో ఒక పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ శాతం దామాషాలో మాత్రమే సీట్లు వస్తాయి. అంటే నియోజకవర్గాలలో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచినా, ఓడినా మొత్తం మీద ఆ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం ఆధారంగానే సీట్లు దక్కుతాయి.

మనం అనుసరిస్తున్న ఒక ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ ధనరాజకీయానికి తద్వారా అవినీతికీ ద్వారాలు తెరవడమే కాకుండా ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలకు హాని చేస్తుంది. ఈ మౌలిక లక్ష్యాల ఆధారంగా ఈ రెండు ఎన్నికల పద్ధతుల్ని ఇప్పుడు పరిశీలించుకుందాం....

### ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం....

మొదటిది: ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో పౌరులు వేసే ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం లభించాలి. అప్పుడే ఆ చట్టసభ ఓటర్ల అభిమతాన్ని ప్రతిబింబిస్తుంది. ఎన్నికల వ్యవస్థ దీనికి దోహదం చేసేదిగా వుండాలి. హరించేది కాకూడదు. ప్రస్తుతం ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ దీనిని ఎలా హరిస్తున్నదీ గత అసెంబ్లీ ఎన్నికలనే ఉదాహరణగా తీసుకుందాం.

2009 ఎన్నికలలో రాష్ట్రంలో 5,78,92,259 మంది ఓటర్లకు గాను 4,20,58,446 మంది ఓటు వేశారు. అంటే రాష్ట్ర శాసన సభ వీరందరికీ ప్రాతినిధ్యం వహించేదిగా వుండాలి. కాని అసెంబ్లీలో గెలిచిన 294 మంది అభ్యర్థులకీ వచ్చిన ఓట్లు కేవలం 1,72,43,593 మాత్రమే. వేసిన ఓట్లలో కేవలం 40 శాతానికి మాత్రమే రాష్ట్ర శాసనసభ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఓటు వేసిన మిగిలిన 60శాతం ఓట్లు అంటే 2,48,14,853 మంది ఓట్లు వేసినా ప్రాతినిధ్యం లభించలేదు. ఇవి ఓడిన అభ్యర్థుల ఓట్లు. నియోజకవర్గం స్థాయిలోనే మురిగిపోయాయి. ఓటు వేసినా చట్టసభలో ప్రాతినిధ్యం లేనందువల్లనే చట్టసభలు రానురాను ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

ఇదే దామాషా పద్ధతి ఎన్నికలలోనైతే పార్టీలకు వచ్చిన ఓట్లశాతం ఆధారంగా పార్టీలకు సీట్లు దక్కేవి. వేసిన ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం లభించేది. అప్పుడు చట్టసభలో ఈ పార్టీల బలాబలాలు వేరుగా వుండేవి.

### తగిన అభ్యర్థిని ఎంచుకునే స్వేచ్ఛ

నియోజకవర్గాలలో మంచి అభ్యర్థుల్నిఎన్నుకోవాలన్న భావనలో ఎవరికీ భిన్నాభిప్రాయాలు వుండవు. ఎన్నికల వ్యవస్థ అలాంటి అవకాశాన్ని కల్పించాలి. ప్రస్తుతం వున్న ఒక్క ఓటు మెజారిటీ వ్యవస్థతో పౌరులకి ఒకటే ఓటు వుంటుంది. మంచి అభ్యర్థి వున్నాడని వేరే పార్టీ అభ్యర్థికి వేస్తే తన పార్టీ నష్టపోతుంది. అభ్యర్థి ఎలాంటి వాడైనా పార్టీ కోసం ఓటువేస్తే మంచి అభ్యర్థికి అవకాశం రాకుండా పోతుంది. ఈ వ్యవస్థలో పార్టీలకు అభ్యర్థులు కీలకం. సమాజహితం కోరే అభ్యర్థి కంటే గెలుపు గుర్రాలే పార్టీలకి అవసరం. ఎన్నిఓట్లు వచ్చినా గెలవకపోతే పార్టీ నష్టపోతుంది. అందుచేత పార్టీలు ధనబలం, కండబలం, కులబలం అభ్యర్థులకే మొగ్గుచూపడం తప్పనిసరి అయింది.

మిశ్రమ సభ్యత్వ దామాషా ఎన్నికల పద్ధతిలో ప్రతిపౌరుడికీ రెండు ఓట్లు వుంటాయి. ఒక ఓటు పార్టీకి, మరోఓటు నియోజకవర్గంలో అభ్యర్థికి వేసుకునే వీలువుంది. అంతేకాకుండా ఒక ఓటరు తన పార్టీకి ఓటు వేసి, నియోజకవర్గంలో మరో పార్టీ అభ్యర్థికి ఓటు వేసినా తన పార్టీకి ఎలాంటి నష్టమూ రాదు. ఎందుకంటే అంతిమంగా పార్టీలకి వచ్చిన ఓట్ల శాతం ఆధారంగానే ఆ దామాషాలోనే సీట్లు వస్తాయి. ఉదాహరణకి ఒక శాసనసభలో 300 స్థానాలువుంటే ఆ రాష్ట్రంలో 150 నియోజకవర్గాలుగా విభజించి మరో 150 స్థానాలు పార్టీలిస్టుకు వీలు కల్పిస్తారు. అంటే పార్టీలు 150 మంది నియోజకవర్గ అభ్యర్థుల్ని 150 మంది పార్టీ జాబితాతో ఎన్నికల బరిలో వుంటాయి. మిశ్రమ సభ్యత్వ దామాషా ఎన్నికల పద్ధతిలో ఒక పార్టీకి 10 శాతం ఓట్లు వస్తే 300 స్థానాలలో ఆ పార్టీకి 30 సీట్లు వస్తాయి. ఇందులో నియోజకవర్గం నుండి ఎన్నికైన వారు ఆ పార్టీ నుండి 10 మంది వుంటే మరో 20 మందిని పార్టీ జబితా నుండి జతచేస్తారు. అలాగే ఒకవేళ ఒక అభ్యర్థి మాత్రమే నియోజకవర్గంలో ఎన్నికైతే 29 మందిని పార్టీ జాబితా నుండి జతచేస్తారు. నియోజకవర్గాలలో ఎంతమంది అభ్యర్థులు గెలిచినా, ఓడినా, ఆ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం ప్రకారం సీట్లు లభిస్తాయి. ఈ పద్ధతివల్ల ఓటరు తన పార్టీకి ఓటు వేసుకుని నియోజకవర్గంలో మరో అభ్యర్థికి ఓటు వేసినా ఆ పార్టీకి ఎలాంటి నష్టం రాదు. ఓటర్లకి తమ పార్టీని, నియోజకవర్గంలో మంచి అభ్యర్థి ఎంపికకు ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. అభ్యర్థుల ప్రాధాన్యత తగ్గడంతో పార్టీలు గెలుపుగుర్రాల కోసం వెంపర్లాట తగ్గుతుంది. మంచి అభ్యర్థులను బరిలోకి దించే వీలు కలుగుతుంది.

### విధానాలపరంగా సంఘర్షణ

ఇక మూడవదీ చివరిదీ. ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ పార్టీలలో సిద్ధాంత రాహిత్యానికి, విధానాల లేమికి, అభివృద్ధి వ్యూహాల శూన్యతకీ దారులు వేసింది. పార్టీలకు గెలిచే అభ్యర్థులు ప్రధానం కావడం, వారి స్థానిక స్థానబలిమి మీద ఆధారపడదంతో పార్టీల వ్యవస్థ బలహీనపడింది. పార్టీ, జెండా ఇప్పుడు అభ్యర్థులకు ఎన్నికల్లో ఒక సహాయ సాధనంగా మారింది. పార్టీల తెరచాటు వున్నప్పటికీ నియోజకవర్గ స్థాయిలో సమీకరణాల మధ్య సంఘర్షణగా అది పరిణమిస్తున్నది. స్థానిక

గెలుపు ప్రధానం గనుక పార్టీలు దానిని ప్రోత్సహిస్తున్నాయి.

రాజకీయ సంఘర్షణ పార్టీల మధ్య, వాటి సిద్ధాంతాల మీద, విధానాల మీద అభివృద్ధి వ్యూహాలమీద జరగాలి. దామాషాపద్ధతి ఎన్నికలలో పార్టీకి వచ్చే ఓట్లే అంతిమంగా సీట్లను తెచ్చిపెడతాయి. అందుచేత పార్టీలకు విధానపరమైన సంఘర్షణ తప్పనిసరి అవుతుంది. మొత్తంమీద ఏ ఎన్నికల వ్యవస్థా పరిపూర్ణంకాదని అందరూ అంగీకరిస్తారు. కాని ఒక్క ఓటు మెజారిటీ వ్యవస్థ కంటే దామాషా పద్ధతి మెరుగైనదీ ప్రజాస్వామ్య పరిపుష్టికి దోహదం చేసేది అని నిస్సందేహంగా చెప్పవచ్చును. అందుచేత ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో అరకొర మార్పుల మీద, చిల్లర సంస్కరణల మీద చర్చకు స్వస్తి చెప్పి కొత్త ఎన్నికల వ్యవస్థకోసం ఉద్యమించడం శ్రేయస్కరం. ◆

## ప్రపంచంలో 13 రకాల ఎన్నికల పద్ధతులను అవలంభిస్తున్నారు

| | |
|---|---|
| 1. ఎఫ్‌పిటిపి (ఫస్ట్ పాస్ట్ ది పోస్టు) | 1. FPTP-First Past the post |
| 2. టిఆర్ఎస్ (టు రౌండ్ సిస్టమ్) | 2. TRS - Two Round System |
| 3. ఎవి (ఆల్టర్‌నేటివ్ ఓట్) | 3. AV -alternative Vote |
| 4. బివి (బ్లాక్ ఓట్) | 4. BV- Block Vote |
| 5. పిబివి (పార్టీ బ్లాక్ ఓట్) | 5. PBV-Party Block Vote |
| 6. పారలల్ –పారలల్ | 6. Parallcl-Parallcl |
| 7. ఎంయంపి (మిక్స్‌డ్ మెంబర్ ప్రపోర్షనల్) | 7. MMp-Mixed Member Proportional |
| 8. లిస్ట్‌పిఆర్ (లిస్ట్ ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్) | 8. List PR-List Proportional Representation |
| 9.ఎస్‌టివి ( సింగిల్ ట్రాన్స్‌ఫరెబుల్ ఓట్) | 9. STV-Single Transferable Vote |
| 10. ఎస్ఎన్‌టివి (సింగిల్ నాన్ ట్రాన్స్‌ఫరెబుల్ ఓట్) | 10. SNTV-Single Non -Transforable Vote |
| 11.ఎల్‌వి (లిమిటెట్ ఓట్) | 11. LV-Limited Vote |
| 12. మోడిఫైడ్ బిసి (మోడిఫైడ్ బోర్డ్ కౌంట్) | 12. Modiffed BC-Modiffed Bords Count |
| 13. నో ప్రొవిజన్స్ ఫర్ డైరక్ట్ ఎలక్షన్స్ | 13. Noprovisions for direct elections |

ప్రపంచంలో 200 దేశాల్లో ఎన్నికల పద్ధతిని పరిశీలిస్తే అందులో ఎఫ్‌పిటిపి (సమీప ప్రత్యర్థి కంటే ఒక ఓటు మెజార్టీ వస్తే గెలిచినట్టు లెక్క) పద్ధతిలో 89 దేశాల్లో ఎన్నికలు జరుపుకుంటున్నారు. 78 దేశాలలో దామాషా పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. మరో 27 దేశాల్లో మిక్స్‌డ్ దామాషా పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవి కూడా దామాషా పద్ధతి కిందికే వస్తాయి. మరో ఆరు దేశాల్లో పైన పేర్కొన్న మిగతా పద్ధతుల్లో ఎన్నికలు జరుగుతున్నాయి.

| ఎన్నికలు జరుగుతున్న పద్ధతి – దేశాల సంఖ్య | | |
|---|---|---|
| 1. ఎఫ్‌పిటిపి | | 89 |
| 2. దామాషా పద్ధతి | 78 | 105 |
| 3. మిక్స్‌డ్ దామాషా పద్ధతి | 27 | |
| 4. మిగతా పద్ధతుల్లో | | 6 |
| **సర్వే చేసిన మొత్తం దేశాల సంఖ్య** | | **200** |



# రాజకీయాల తీరు మార్చాలి : జేపీ

రాజకీయాల పేరుతో మనం - జగన్‌కి ఎన్ని ఓట్లు వస్తాయి, ఉప ఎన్నికలలో ఎవరు గెలుస్తారు, చంద్రబాబు పాపం చాలా తిరుగుతున్నారు, కాంగ్రెస్ ముక్కలైపోతోంది వంటి సాంకేతిక అంశాలను చర్చిస్తున్నాం తప్ప మంచినీరు ఇవ్వటం, విద్యుత్‌ను మెరుగుపరచటం, అవినీతి నిర్మూలన వంటి అసలైన రాజకీయంతో ముడిపడిన అంశాలను లోతుగా చర్చించి పరిష్కారాలను సాధించేందుకు మాత్రం ప్రయత్నించటం లేదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పార్టీలు, నేతల చుట్టూ తిరిగే అలాంటి పాతరాజకీయాన్ని పునర్నిర్వచించి జనజీవితాలతో ముడిపడిన కొత్త రాజకీయాన్ని సాధించేందుకు యువత అవగాహనతో, అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమాజంలో మార్పు కోసం సమయం కేటాయించేందుకు ముందుకొచ్చిన యువత, విద్యార్థులనుద్దేశించి ఏప్రిల్ 7,2012న లోక్‌సత్తా పార్టీ ప్రధానకార్యాలయంలో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.

జేపీ మాట్లాడుతూ... రాజకీయం అంటే మనకు సరైన అవగాహన లేకపోవటం వల్ల మన జీవితాలలో కీలకమైన రోడ్లు, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి అంశాల గురించి ఏదైనా తక్షణ సంచలన సమస్య వస్తే తప్ప పట్టించుకోవటం లేదని, దీనివల్ల ప్రజాధనం లూటీ, దుర్వినియోగమవుతూ, మనం ఎల్లకాలం ఎవరోకరి దయాదాక్షిణ్యాల మీద బతికేవారుగా మిగిలిపోతున్నామని అన్నారు. వేసవిలో తాగునీటి సమస్య వస్తే ఆ పూట ఎట్లా గట్టెక్కుతామా అనే చూస్తున్నామని, కానీ రాష్ట్రానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద ఏడాదికి దాదాపు 7,000-8,000 కోట్లు వస్తున్నా, దాన్ని సరిగా భూగర్భజలాల పరిరక్షణ వంటి లక్ష్యాల కోసం సద్వినియోగం చేయకపోవటం వల్ల తీవ్రంగా నష్టపోయామన్న అంశాన్ని గుర్తించటం లేదన్నారు. మరో కీలకరంగం విద్యుత్‌నే తీసుకుంటే, పెరిగిన టారిఫ్‌ల చుట్టూ గొడవలు చేస్తున్నామే తప్ప, అసలు ఆరంగంలో ఉన్న మౌలిక సంక్షోభాన్ని కనీసం చర్చించటం లేదన్నారు. "సాగునీటిరంగంలో ప్రభుత్వ అలవిమాలిన నిర్లక్ష్యం వల్ల విద్యుత్‌రంగంలో ఏటా ఆంధ్రప్రదేశ్ రూ. 7,400కోట్లు నష్టపోతోంది. ఆ నష్టాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టకుండానే, మళ్లీ ఎత్తిపోతల పథకాల్ని చేపట్టి ఎకరాకి రూ. 3-4లక్షల వ్యయంతో నీళ్లిచ్చే పథకాల్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ పథకాలు అమలులోకి వస్తే ఒక్క సాగునీటిరంగంలోనే రోజుకు 25కోట్ల యూనిట్ల వ్యయమవుతుంది. ఖజానాకు ఏడాదికి రూ. 20,000-25,000 కోట్ల నష్టం వస్తుంది. సరాసరిన రూ. 25వేల లోపు ఆదాయం లభించే ఎకరాకి ఎత్తిపోతల విద్యుత్ వ్యయం వల్ల రూ. 60వేలు ఖర్చవుతుంది" అని జేపీ అన్నారు. తాను ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు 26 ఏళ్ల క్రితం కేవలం రూ. 45 కోట్ల వ్యయంతో 453 ఎత్తిపోతల పథకాల్ని చేపట్టి 2800 బోరుబావుల్ని నిర్మించానని, 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సుమారు 1లక్ష కుటుంబాలను శాశ్వతంగా పేదరికం నుంచి బైటపడేయగలిగానని, సరైన అవగాహనతో, నిబద్ధతతో పనిచేయటం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. రాజకీయాలంటే అధికార సంపాదనే తప్ప ప్రజాప్రయోజనంతో, ప్రజాసమస్యల శాశ్వత పరిష్కారంతో ముడిపడినవి కావు అనుకోవటం వల్లే ఈవేళ రాష్ట్రం అన్నివనరులూ ఉన్నా వేగంగా దిగజారిపోతోందని అన్నారు. అలాగే రాష్ట్రంలో మద్యం సిండికేట్లపై కొరడా ఝుళిపించి చర్యలు చేపడుతున్నందుకు ఒక సిన్సియర్ ఎక్సైజ్ అధికారిని బదిలీ చేశారని, దీనివల్ల ఏ పార్టీకి, ఏ వ్యక్తికి లాభం,నష్టం అనే చర్చలు కాకుండా అవినీతిని అంతం చేయాలంటే నేరపరిశోధనాసంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి ఎంత కీలకమో యువత గుర్తించాలని జేపీ కోరారు.

"ఇదేతీరు కొనసాగితే మరో పదేళ్లు పోయాక ఈ చర్చలు కూడా అక్కర్లేకుండా రాష్ట్రం నుంచి వలసలు వెళ్లిపోవచ్చు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే రాజకీయాన్ని పునర్నిర్వచించు కోవటం తప్ప మార్గం లేదు. మన జీవితాలకు పనికొచ్చే ప్రతి అంశంపై స్పష్టతతో, నిబద్ధతతో పోరాటాలు చేయటమే అసలైన పౌరసత్వం, నాయకత్వం, రాజకీయం. మునుపెన్నడూలేని సాంకేతికపరిజ్ఞానం మీకు అందుబాటులో ఉంది. విజ్ఞానం, ఆత్మవిశ్వాసం పునాదిగా రాజకీయాల్ని మార్చేందుకు ముందుకు కదలండి" అని జయప్రకాష్ నారాయణ్ యువతను కోరారు. ■

# బానిసత్వంలాగే అవినీతి కూడా అంతమవక తప్పదు

*" ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో*

*ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో*

*ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో*

*ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా*

*'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో*

*అక్కడ*

*వ్యవస్థకు సంబంధించిన పున:సమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం*

*అప్పుడు*

*తమ గురించి, తమకు సంబంధించినవారి గురించి*

*తమ చుట్టూరా వున్నవారి గురించి*

*తమ కార్యకలాపాలకు సంబంధించి*

*అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"*

... ఈవేళ భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న దుస్థితి అద్దంపట్టే ఈ మాటలు లోక్‌సత్తా రాజకీయ ఉద్యమకారులకు చిరపరిచితం. వివక్షలేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే వ్యవస్థీకృత 'మార్పు' దిశగా ప్రజలను చైతన్యపరిచేందుకు తాను చేస్తున్న అలుపెరుగని పోరాటంలో ప్రచారాస్త్రంగా ఈ మాటలను కూడా ఉపయోగించుకుంటోంది, తన ప్రచురుణల ద్వారా ప్రజలలోకి తీసుకెళ్తోంది. ఈ మాటల్ని రాసింది రాబర్ట్ క్లిట్‌గార్డ్ అనే సామాజిక అధ్యయనకారుడు.

సరిగ్గా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరం ఫిబ్రవరి 13, 1947లో జన్మించిన క్లిట్‌గార్డ్ అమెరికన్ పౌరుడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ వరకూ చదివిన క్లిట్‌గార్డ్... కాలిఫోర్నియాలోని క్లేర్‌మాంట్ గ్రాడ్యుయేట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ వరకూ అనేక ప్రతిష్ఠాత్మక పదవుల్ని నిర్వహించారు. ఆర్థికశాస్త్రంలో, అంతర్జాతీయ అభివృద్ధి, భద్రత తదితర అంశాలలో ఆచార్యునిగా విశేషసేవలందించారు. ప్రపంచానికి పరిష్కారాలనందించే తన అసమాన ప్రతిభావిశేషాల వల్ల లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలోని దాదాపు 30దేశాలలో



**రాబర్ట్ క్లిట్‌గార్డ్** (ఫిబ్రవరి 13, 1947)

కన్సల్టింగ్ మరియు పరిశోధానా సహకారాన్ని అందించారు. అన్నిటినీ మించి ప్రపంచాన్ని పీడిస్తున్న అవినీతి మహమ్మారిపై పోరాటమార్గాల్ని, పరిష్కారాల్ని అందించే అంతర్జాతీయస్థాయి నిపుణునిగా క్లిట్‌గార్డ్ ఖ్యాతిని గడించారు. అవినీతినిర్మూలనకు భారతదేశంలోనే అత్యంత సమగ్రంగా, నిర్మాణాత్మకంగా, వ్యవస్థీకృతంగా పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ చెబుతున్న విషయాలకంటే అదనంగా క్లిట్‌గార్డ్ ఏమీ చెప్పనప్పటికీ, భారతదేశ పరిస్థితులకు తగ్గ నిర్దిష్ట పరిష్కారాలను సూచించనప్పటికీ, ఆయన పరిశీలనల్ని, ఆయనను ప్రభావితం చేసిన అంశాలను కొంతమేర తెలుసుకోవటం మనకు కర్తవ్యనిర్వహణలో కొంత ఉత్తేజాన్నిస్తుందనటంలో సందేహం లేదు. **అందుకే 'అవినీతి గతి ఏమిటి' అనే కోణంలో క్లిట్‌గార్డ్ వ్యక్తం చేసిన కొన్ని భావాలను స్వేచ్ఛానువాదంగా లోక్‌సత్తా టైమ్స్ పాఠకులతో పంచుకునేందుకు ఈ ప్రయత్నం...**

+ వ్యవస్థీకృత అవినీతి చివరకు అంతమవక తప్పదని జాన్ టి. నూనన్ అనే అమెరికన్ న్యాయమూర్తి 1985లో రాసిన 'బ్రైబ్స్' అనే పుస్తకంలో చాలా సాధికారికంగా, సోదాహరణంగా వివరించారు. "బానిసత్వం ఒకప్పుడు సాధారణ జీవనవిధానం. కానీ ఈవేళ గుర్తుచేసుకోవటానికి కూడా మనకు మనసొప్పని ఒక చేదు గతం అది. అదేతీరుగా ఒక అధికారిక బాధ్యతను నెరవేర్చటానికి లంచం ఇవ్వాల్సిన పరిస్థితి కూడా అంతరించిపోతుంది" అని నూనన్ అందులో పేర్కొన్నారు.

అవినీతి అనేది ప్రపంచంలో ఎక్కడా, ఏ జాతిసంస్కృతిలో భాగం కాదని నూనన్ స్పష్టంచేస్తారు. అవినీతిని అవమానకరంగా, డబ్బుకు అమ్ముడుపోవటంగా, నమ్మకద్రోహంగానే జనం పరిగణిస్తుంటారు. నైతిక శక్తులతోపాటు సమాచార, ప్రచారాలు పెరగటం, పోటీతత్వం విస్తరించటంతో వ్యవస్థీకృత అవినీతి అంతమవుతుంది అని నూనన్ అంటారు.

+ సింగపూర్ వంటి దేశాల విషయంలో నూనన్ జోస్యం నిజమైంది. అలాగే మొజాంబిక్ నుంచి కొలంబియా వరకూ వ్యవస్థీకృత అవినీతి తగ్గుముఖం పట్టింది. కానీ కొన్నిచోట్ల తగ్గిన అవినీతి తిరిగి మొదలైన ఆందోళనకర ఘటనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ చూస్తుంటే... అవినీతిని అంతం చేయటం సాధ్యంకాదా? నూనన్ అభిప్రాయాలు తప్పా? అనే సందేహాలు కూడా ముసురుకుంటాయి. ఇలా అవినీతి ఏదోకరకంగా కొనసాగుతూ, విశృంఖలమవుతుండటం చూసి... అబ్బే, అవినీతి మామూలే, అదేమంత పెద్దసమస్య కాదు, సర్దుకుపోదాం అని మనలోని చాలామంది బాహాటంగానే తేల్చిపారేస్తుంటారు. ఒక యంత్రం సరిగా పనిచేయాలంటే చమురు వేయటం అవసరమైనట్టు, వ్యాపారాన్ని, దిగజారిన రాజకీయాలను నడిపించటానికి లంచాలు కూడా అవసరమని వాదించేస్తుంటారు. కానీ అవినీతి చూసీచూడనట్టు వదిలేయాల్సిన అంశం కాదని, అదో భయంకర సమస్యని అనేక ఆర్థిక విశ్లేషణలు, ఉదాహరణలు తేటతెల్లం చేస్తున్నాయి. అవినీతి వల్ల పెట్టుబడులు తగ్గి అభివృద్ధి మందగించి సామాజిక సేవలు దెబ్బతింటాయి, న్యాయం అందకుండా పోతుంది. అవినీతిమయమై సుపరిపాలన లేని దేశాలలో శిశుమరణాలు, పౌష్టికాహారలోపం, నిరక్షరాస్యత ఎక్కువ ఉంటాయి. మొత్తంగా చూస్తే... అవినీతి వల్ల పేదలు ఎక్కువ దెబ్బతింటుంటారు, పేదరికం శాశ్వతంగా కొనసాగుతుంటుంది.

కాబట్టి వివక్ష లేకుండా పుట్టిన ప్రతిబిడ్డా తన సామర్థ్యంమేర ఎదగాలంటే, అవినీతిపై ఖచ్చితంగా వేటు పడాల్సిందే. వ్యవస్థీకృత అవినీతిని అంతం చేయాల్సిందే. అవినీతిని తగ్గించాలంటే ఏం చేయాలి?

అవినీతిని కేవలం నైతిక సమస్యగా చూస్తే ఫలితాలు రావు. వ్యవస్థీకృతమైన ఏర్పాట్లతో నిస్సందేహంగా అవినీతిని కట్టడి చేయవచ్చు. నా అంతర్జాతీయ అనుభవం ప్రాతిపదికన వ్యవస్థీకృత అవినీతిపై యుద్ధాన్ని గెలవాలంటే ఈ దిగువ 5 చర్యలు అవసరం...

## అవినీతి నిర్మూలనకి క్లిట్‌గార్డ్ సూచించిన పరిష్కార మార్గాలు.....

**1. సరైన వ్యవస్థని, నాయకత్వాన్ని నిర్మించి ప్రోతాహాల్నివ్వటం:** వ్యవస్థని, నాయకత్వాన్ని, ప్రోత్సాహాల్ని ఇచ్చే రీతిలో ప్రభుత్వ సంస్కరణల్ని తీసుకురావాలి. అవినీతి వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకోకుండా అవినీతి నిర్మాణాల్ని లక్ష్యంగా చేసుకుని పోరాడాలి.

**అవినీతి= గుత్తాధిపత్యం+విచక్షణ-జవాబుదారీతనం**

ఒక వస్తువు లేదా సేవపై గుత్తాధిపత్యం ఉండి, జవాబుదారీతనం లేని విచక్షణాధికారం ఉన్నప్పుడు అవినీతి పెచ్చరిల్లుతుంది.

అలాగే అవినీతిని సమర్థంగా నిరోధించే, అవినీతికి పాల్పడేవారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించే, నైతికవిలువలలో ఆదర్శప్రాయంగా ఉండే నాయకులు కావాలి. అలాంటి నేతలు ఉంటేనే అవినీతిని పూర్తిస్థాయిలో అదుపుచేయగలం.

అలాగే అవినీతికి పాల్పడ్డ వారికి శిక్షలతోపాటు నిజాయతీగా పనిచేసే ప్రజాసేవకులకు ప్రోత్సాహకాలు కూడా ఉండాలి.

**2. అవినీతి నిర్మూలన ప్రభుత్వ విధానంగా ఉండాలి:** మొత్తం దేశవ్యాప్తంగా అవినీతి వాతావరణం నెలకొని ఉంటే, కేవలం ఒక విభాగాన్నో, ఒక మంత్రిత్వ శాఖనో ప్రక్షాళన చేయటం వల్ల ఫలితం ఉండదు. అలాగే ఇతర మంత్రిత్వ శాఖలతో, విభాగాలతో సమన్వయం లేకుండా జాతీయస్థాయి అవినీతి నిరోధక సంస్థను ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదు. అవినీతి నిర్మూలనను ఒక సమగ్ర విధానంగా ప్రభుత్వం అమలుచేయాలి.

**3. వ్యాపారవేత్తలను, ప్రజలను కూడా భాగస్వాములను చేయటం:** అలాగే అవినీతిపై పోరాటం కేవలం ప్రభుత్వానికే పరిమితమైతే సరిపోదు. వ్యాపారస్తులను, న్యాయవాదులను, అకౌంటెంట్లను ఇలా అవినీతి నియంత్రణలో అన్నివర్గాలనూ భాగస్వాముల్ని చేయాలి. లంచాలు, మోసాలు ఎన్నిరకాలుగా ఉంటాయో, ఎలా కొత్తపుంతలు తొక్కుతాయో ఆయావర్గాల మధ్య ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి ఉండే ఏర్పాట్లు ఉండాలి.

## నిజాయితీ ఒప్పందం

ఒక పరిధి దాటిన పబ్లిక్ టెండర్ల విషయంలో బిడ్డర్లు 'నిజాయతీ

ఒప్పందం' మీద సంతకం చేయటం వంటి ఏర్పాట్లు ఉండాలి.

లంచాలు ఇవ్వం, ఖర్చులు, ఇతర నిబంధనల విషయంలో మోసం చేయం అని ఆ ఒప్పందం ద్వారా హామీ ఇవ్వాలి. బిడ్ గెలుచుకున్న కంపెనీ అవినీతికి, అవకతవకలకు పాల్పడినట్టు ఒప్పందం మీద సంతకం పెట్టిన కంపెనీకి సందేహం వస్తే... ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీ తన లెక్కల్ని బహిరంగపరిచి చూపించాలి.

**4. స్టింగ్ ఆపరేషన్ వంటి అవ్యవస్థీకృత పద్ధతులలో దాడిచేయటం:** అవినీతి విశృంఖలంగా వ్యవస్థీకృతమైనప్పుడు కేవలం నిరోధక చర్యలు సరిపోవు. దాని బలహీనతల మీద కీలెరిగి వాతపెట్టాలి. స్టింగ్ ఆపరేషన్లు, అండర్‌కవర్ ఏజెంట్లు, అవినీతిలో భాగస్వాములుగా ఉన్నవారిని సాక్షులుగా మార్చటం వంటి పద్ధతులలో దాడి చేయాలి. అవినీతి వ్యవస్థలలో బలహీనాంశమేమంటే... దోపిడీ చేసి సంపాదించిన డబ్బును దాచటం. నేతల, అధికారుల జీవనశైలిని గమనిస్తుండాలి. అధికారికంగా వారు తమ స్థాయి కంటే ఎక్కువగా గడుపుతుంటే అవినీతికి పాల్పడ్డట్టు పసిగట్టవచ్చు. కొన్ని దేశాలలో పౌరులే ఇలాంటి విషయాలను వివరంగా నమోదుచేసి సమాచారాన్ని పంపించి అవినీతి నేతల్ని, వ్యవస్థల్ని కుప్పకూల్చటంలో కీలకపాత్ర పోషించారు.

**5. నైతికత కీలక ప్రాధాన్యతను నిరంతరం గుర్తుంచుకోవాలి:** అవినీతి అనేది ప్రపంచవ్యాప్తంగా అనైతికాంశంగా, ఆమోదయోగ్యంకాని అంశంగానే పరిగణించబడుతోందని నూనన్ చెప్పినట్టు ముందే చదివాం. అవినీతి ఒక జీవనవిధానంగా ఉన్న ప్రాంతాలలో సైతం పౌరులు అవినీతిని ఆమోదించలేరు. మన సామూహిక వ్యతిరేకత అంతిమంగా మన వ్యవహారశైలిని మార్చి అవినీతిని అంతం చేస్తుందని నూనన్ అభిప్రాయం. అది ఎలా జరుగుతుందనేది నూనన్ చరిత్రలో ముందుకొచ్చే శక్తులకే వదిలేశారు.

**అవినీతిపరులను సహించం, అవినీతిపరులను ఓడిస్తాం అని మనం ముందుకు రావటం కూడా ముఖ్యం**

నూనన్ జోస్యాన్ని ఫలింపచేయాలంటే... గుత్తాధిపత్యాల్ని తొలగించి పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి, అవినీతి నిరోధానికి ప్రభుత్వపరంగా వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసి, వ్యాపారస్తుల, పౌరసమాజం భాగస్వామ్యాన్ని పెంపొందించటం, అవినీతి కలాపాలను బట్టబయలు చేసేందుకు పౌరులకు అధికారాన్నివ్వటం వంటి ఇంతకుముందు పేర్కొన్న చర్యలతోపాటు... అవినీతిపరులను సహించం, అవినీతిపరులను ఓడిస్తాం అని మన భావప్రకటన ద్వారా, ఓటు హక్కు ద్వారా చాటిచెప్పాలి. వీటన్నిటికీ కావలసిన సంకల్పబలాన్ని ప్రదర్శించినప్పుడే అవినీతిరహిత సమాజాన్ని సాధించగలం.

అవినీతి అభివృద్ధిని, పేదల ప్రయోజనాలను కబళిస్తుంది. మానవస్వభావ విరుద్ధమైన అవినీతి అంతమవటం ఖాయం. కానీ అది ఎప్పుడు జరుగుతుంది అనేది మాత్రం పైన పేర్కొన్న అంశాలను సాకారం చేయటానికి మనం ఏస్థాయిలో కృషిచేస్తున్నామన్న వాస్తవం మీదే ఆధారపడివుంటుంది. ◆

**-21వ శతాబ్దపు భారతీయుడు**

***When in a society the shameless triumph; when the abuser is admired;***

***when principles end and only opportunism prevails;*** *

***when the insolent rule and the people tolerate it;***

***when everything becomes corrupt but the majority is silent…. When so many "whens" unite, perhaps it is time to hide oneself;***

***time to suspend the battle; time to stop being a Quixote;***

***it is time to review our activities, reevaluate those around us, and return to ourselves.***

***- Robert Klitgaard***

# భూ పందేరాలపై 'కాగ్' నివేదిక

## 4.2 2006-11 మధ్య కాలంలో జరిగిన భూముల బదలాయింపు

ఈ సమీక్షా కాలంలో, రాష్ట్రప్రభుత్వం 1027 మంది లబ్ధిదారులకు మొత్తం 88,492 ఎకరాల ప్రభుత్వ భూమిని వివిధ అవసరాలకు బదలాయించింది. ఈ వివరాలు కిందచార్టులో ఉన్నాయి.

**చార్టు-1**
**2006-11లో రాష్ట్రంలో బదిలీ చేసిన భూమి**




గృహ నిర్మాణం 17%
ఇతరాలు 17%
వనరుల సమీకరణ 5%
పోర్టులు 22%
ఏ.పి.ఐ.ఐ.సి 39%

ఎంపిక చేసుకున్న 11 జిల్లాలలో 2006-11 మధ్యకాలంలో 459 మంది వ్యక్తులు/సంస్థలు/శాఖలకు మొత్తం 50,285.90 ఎకరాల భూమిని బదిలీ చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన జిల్లాల వారీ వివరాలు పట్టిక-2లో ఉన్నాయి.

**పట్టిక -2**

**జిల్లాలవారీగా భూబదలాయిల వివరాలు**

| జిల్లా | బదలాయించిన భూమి (ఎకరాల్లో) | బదలాయించిన కేసుల సంఖ్య | ఆడిట్‌లో పరిశీలించిన కేసుల సంఖ్య |
|---|---|---|---|
| అనంతపురం | 10853.01 | 126 | 126 |
| గుంటూరు | 5895.90 | 21 | 21 |
| హైదరాబాద్ | 116.24 | 32 | 32 |
| కృష్ణా | 41.56 | 15 | 14 |
| మహబూబ్‌నగర్ | 2010.31 | 31 | 25 |
| ఎస్.పి.ఎస్.నెల్లూరు | 3002.06 | 15 | 15 |
| రంగారెడ్డి | 5796.80 | 120 | 104 |
| శ్రీకాకుళం | 4488.89 | 16 | 16 |
| విజయనగరం | 742.34 | 13 | 13 |
| వరంగల్ | 222.83 | 09 | 09 |
| వైఎస్ఆర్ | 16388.31 | 53 | 26 |
| ఇతరులు | 727.65** | 08 | 08 |
| **మొత్తం** | **50285.90** | **459** | **409** |

**కొన్ని ముఖ్యాంశాలు - 2**

* చిత్తూరు, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలు.

* ఇది 'రెగ్యులర్ లోకల్ ఆడిట్ ఇన్‌స్పెక్షన్స్'లో పరిశీలించిన మొత్తం బదలాయింపు కేసులకు సంబంధించినది. పూర్తి సమాచారం లేని కారణంగా, ఈ జిల్లాల్లో బదలాయించినట్లు చూపిన భూమి ఆడిట్‌లో పరిశీలించిన కేసులకు సంబంధించినది మాత్రమే.

గమనిక : 23 భూబదలాయింపు కేసుల (రంగారెడ్డి : 16, మహబూబ్‌నగర్ : 6 కృష్ణా : 1) రికార్డులను ఆడిట్ పరిశీలనకు అందుబాటులో వుంచలేదు.

## 4.3 బదలాయించిన భూములకు సంబంధించి, భూముల విలువ ఇంకా వసూలు కాని కేసులు

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని 60 కేసుల్లో, బదలాయించిన భూములకు నిర్ణయించిన విలువను ప్రభుత్వం ఇంకా వసూలు చేయవలసి ఉంది. 2011 జూన్ నాటికి ఈ విషయంలో ప్రభుత్వానికి రావలసిన బకాయిల మొత్తం రూ. 2,559 కోట్లు, జిల్లాలవారీగా బకాయిల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి. (అనుబంధం-ఎ)

**పట్టిక - 3**

**భూబదలాయింపునకు సంబంధించి బకాయి ఉన్న వసూళ్ళు**

| జిల్లా | బదలాయించిన భూమి (ఎకరాల్లో) | బదలాయింపు కేసుల సంఖ్య | వసూలు కావలసిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| గుంటూరు | 4245.56 | 9 | 3.56 |
| హైదరాబాద్ | 73.98 | 18 | 1183.74 |
| మహబూబ్‌నగర్ | 23.00 | 3 | 0.37 |
| రంగారెడ్డి | 397.69 | 10 | 1312.23 |
| ఎస్‌పిఎస్‌నెల్లూరు | 2886.39 | 5 | 17.53 |
| శ్రీకాకుళం | 3333.45 | 1 | 28.33 |
| విశాఖపట్నం | 337.40 | 3 | 9.89 |
| విజయనగరం | 65.15 | 9 | 3.21 |
| వరంగల్ | 72.14 | 1 | 0.42 |
| వైఎస్ఆర్ | 63.74 | 1 | 0.10 |
| **మొత్తం** | **11498.50** | **60** | **2559.38** |

భూముల బదలాయింపునకు సంబంధించి ఆడిట్‌లో ప్రధానంగా కనుగొన్న విషయాలను కింద చర్చించడమైనది.

### 4.4 కేటాయింపుల్లో సారూప్యత, పారదర్శకత లేకపోవడం

2006-11 మధ్యగల ఐదేళ్లకాలంలో జరిగిన భూ కేటాయింపులకు సంబంధించిన 409 కేసులను ఆడిట్‌లో పరిశీలించగా, విస్తీర్ణం లేదా, మార్కెట్ విలువ లేదా ఈ రెండింటిలోనూ, విలువైన భూముల విషయంలో, చాలావరకు కేసుల్లో, కేటాయించవలసిన ధరలను నిర్ణయించడంలో వివిధ స్థాయిల్లోని అధికారులు చేసిన సిఫార్సులను/సలహాలను పరిగణనలోకి తీసుకోలేదని తేలింది. ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసిన కేసుల్లో (అనుబంధం– బి), జిల్లా కలెక్టరు/సాధికార సంఘం విలువ కట్టిన అప్పటి మార్కెట్ ధరకు, ప్రభుత్వం భూములను కేటాయించిన ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసం కారణంగా కేటాయింపుదారులకు రూ. 1,784 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. ఇక్కడ లెక్కకు తీసుకున్న మార్కెట్ విలువ ప్రధానంగా ఆ పరిసర ప్రాంతాల్లో భూమిని 'రిజిస్టరు' చేసిన విలువే కావడంతో, వాస్తవంలో మార్కెట్ విలువ రిజిస్టరు చేసిన విలువ కంటే చాలా అధికంగా ఉండడం అనుభవంలో ఉన్నదే కనుక, లెక్కకు తీసుకున్న ధర, వాస్తవమైన మార్కెట్ ధర కంటే తక్కువగా ఉంటుంది. కిందిస్థాయి పరిపాలనాధికారులు, అమలులో ఉన్న నియమాల ఆధారంగా, భూములకు విలువకట్టి, ఏకరీతి విధానాన్నే చాలావరకు అనుసరించి. స్పష్టమైన సిఫార్సులను చేసినప్పటికీ, భూకేటాయింపుల్లో రేట్లను తగ్గించడానికి గల కారణాలను విశదీకరించే రుజువులు ఆడిట్‌కు అందుబాటులో ఉంచిన రికార్డులలో లభ్యంకాలేదు. ఈ కేటాయింపులలో జవాబుదారీతనం, పారదర్శకతా ప్రమాణాలను పాటించలేదు. ఉల్లంఘనలకు పాల్పడిన కేసులలో ఔచిత్యంలేదు. స్పష్టమైన కార్యాచరణ విధానం కొరవడింది. ఈ కేసులలో విచక్షణ స్థాయి ఆందోళనకరంగా ఉంది.

ఆడిట్ పరిశీలనలో, ప్రత్యేకించి అనంతపురం, రంగారెడ్డి, వై.ఎస్.ఆర్. జిల్లాల్లో, ఏ.పి.ఐ.ఐ.సి మాధ్యమం ద్వారా ఏకపక్షంగా అనేక ప్రవేటు సంస్థలకు భూములను కేటాయించారనీ, ఆర్థికపరంగా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినేలా భారీగా రాయితీలు కల్పించరనీ, అయినప్పటికీ ఆశించిన విధంగా పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలు కలగలేదనీ వెల్లడైంది. వీటిలోని చాలా సంస్థలు నిర్దేశిత గడువులో ఎమ్.ఓ.యు./ ఎమ్.ఓ.ఏ.లలోని నిబంధనలను పాటించలేదు. ఈ సంస్థల కార్యకలాపాలను ఏ.పి.ఐ.ఐ.సి నిశితంగా పర్యవేక్షించలేదు. కేటాయింపునకు సంబంధించి నిర్దేశించిన షరతులకు సంస్థలు కట్టుబడి ఉండనప్పటికీ, ఈ కేటాయింపులను రద్దుచేయడం, స్థలాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకోలేదు.

## అధ్యాయం 5 - సెజ్‌లలో ఉద్యోగావకాశాల కల్పన

ఒక ప్రభుత్వరంగ సంస్థగా, పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండళ్లను (సెజ్‌లను) అభివృద్ధి చేయడం ద్వారా మౌలిక వసతులను మెరుగుపరచే బాధ్యత ఏ.పి.ఐ.ఐ.సి.పై ఉంది. ప్రత్యేక ఆర్థిక మండళ్ల చట్టం – 2005 ను అనుసరించి, రాష్ట్రంలో 53 సెజ్‌లను ఏ.పి.ఐ.ఐ.సి. ద్వారా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. )ఏ.పి.ఐ.ఐ.సి. స్వయంగా 17 సెజ్‌లు, ఈ సంస్థ సహాయంతో మరో 36 సెజ్‌లు.)

### 5.1 కల్పించిన ఉద్యోగావకాశాలు

ఈ నివేదికలోని పేరాలు 4.8, 4.9 (క్రమసంఖ్య 8-11)లలో చర్చించిన విధంగా, ఐ.టి. సంబంధిత సెజ్‌లను ఏర్పాటుచేయడం కోసం, ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాల్లో, చేసిన భూకేటాయింపులతోపాటు 12 ఇతర సెజ్‌లకు సంబంధించిన లావాదేవీలను ఎంపిక చేసిన జిల్లాల్లో మచ్చుకు తనిఖీ చేయగా

**పట్టిక –7**

| క్ర. సం | కంపెనీ పేరు | భూవిస్తీర్ణం (ఎకరాల్లో) | కేటాయించిన సంవత్సరం | పరిశ్రమ | కల్పించ వలసిన ఉద్యోగాలు | కల్పించిన ఉద్యోగాలు |
|---|---|---|---|---|---|---|
| 1 | ఎల్.టి, హైటెక్‌సిటీ, గన్నవరం, కృష్ణా జిల్లా | 30.17 | 2006 | ఐ.టి. సెజ్ | 10000 | 210 |
| 2 | పాదరక్షల సెజ్, మంబట్టు, ఎస్.పి.ఎస్. నెల్లూరు జిల్లా | 313.57 | 2006 | పాదరక్షలు | 15000 | 5000 |
| 3 | బ్రాండిక్స్, ఇండియా అపెరల్ సిటీ, విశాఖపట్నం | 1000.00 | 2006 | వస్త్రాల పార్కు | 60000 | 13298 |
| 4 | భారతీయ ఇంటర్నేషనల్ నెల్లూరు, ఎస్.పి.ఎస్, నెల్లూరు జిల్లా | 250.59 | 2007 | తోలు | 10000 | 0 |
| 5 | శ్రీసిటీ, తడ, ఎస్.పిఎస్. నెల్లూరు జిల్లా | 3798.86 | 2007 | బహుళ ఉత్పత్తుల సెజ్ | 175000 | 5000 |
| 6 | ప్రత్యేక ప్రాజెక్టుల మండలి, విశాఖపట్నం జిల్లా | 2210.28 | 2007 | బహుళ ఉత్పత్తుల సెజ్ | 6507 | 2074 |
| 7 | ఎమ్.ఎ.ఎన్. ఫ్యాబ్రిక్ పార్కు ఇండియా ప్రై.లి. | 714 | 2007 | వస్త్రాలు, దుస్తులు పార్క్ నెల కొల్పడానికి | 31000 | 0 |
| 8 | లేపాక్షి నాలెడ్జ్ హబ్ ప్రై.లి. గోరంట్ల & చిలమాతూరు, అనంతపురం జిల్లా (పేరీ4.8చూడండి) | 8844.01 | 2009 | ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ నాలెడ్జ్ హబ్ | 150000 | 0 |
| 9 | బ్రహ్మణి ఇన్‌ఫ్రాటెక్ ప్రై.లి. రావిర్యాల్, మామిడిపల్లి గ్రామాలు, రంగారెడ్డి జిల్లా (పేరా 4.9 చూడండి) | 250 | 2006 | ఐ.టి/ఐ.టి ఆధారిత సేవల సెజ్ ఏర్పాటుకు | 45000 | 0 |

వాటిలో ఏడు సెజ్‌లే (క్రమసంఖ్య 1-7) అనుకున్న విధంగా ఉద్యోగావకాశాలను కల్పించలేదని ఈ కింది వివరాల నుండి తెలుస్తోంది.

| క్ర. సం | కంపెనీ పేరు | భూవిస్తీర్ణం (ఎకరాల్లో) | కేటాయించిన సంవత్సరం | పరిశ్రమ | కల్పించ వలసిన ఉద్యోగాలు | కల్పించిన ఉద్యోగాలు |
|---|---|---|---|---|---|---|
| 10 | ఇందుటెక్ జోన్ ప్రై.లి. మామిడిపల్లి గ్రామం, రంగారెడ్డి జిల్లా | 250 | 2006 | ఐ.టి/ఐ.టి ఆధారిత సేవల సెజ్ ఏర్పాటుకు | 45000 | 0 |
| 11 | స్టార్‌గేజ్ ప్రాపర్టీస్ ప్రై.లి. రావిర్యాల గ్రామం, రంగారెడ్డి జిల్లా | 250 | 2006 | ఐ.టి/ఐ.టి ఆధారిత సేవల సెజ్ ఏర్పాటుకు | 45000 | 0 |
| | మొత్తం | 17911.48 | | | 592507 | 25582 |

కల్పించాలనుకున్న 5.93 లక్షల ఉద్యోగాలకు గానూ,9594.01 ఎకరాలను రాయితీ ధరకు పొందిన నాలుగు సెజ్‌లు అసలు ఉద్యోగావకాశాలను కల్పించనేలేదు. ఈ విధంగానే 8317.47 ఎకరాలను పొందిన మిగిలిన ఏడు సెజ్‌లు గత నాలుగైదు సంవత్సరాల్లో కేవలం 0.26 లక్షల (4 శాతం) ఉద్యోగాలను మాత్రమే కల్పించాయి.

## అధ్యాయం - 6

## భూములను కేటాయించిన ఉద్దేశానికి వినియోగించకపోవడం

పై పేరాలలోని విలక్షణమైన కేసులతో పాటు, 2006-07 నుండి 2010-11 మధ్య, అంతకుముందు కూడా భూములను కేటాయించిన అనేక సందర్భాలలో ప్రభుత్వం భూములను కేటాయించిన ఉద్దేశం- అది పాఠశాల, వసతి గృహం (హాస్టల్), కార్యాలయ భవనం, పరిశ్రమ, సెజ్‌ల నిర్మాణం వంటివి ఏదైనప్పటికీ - నెరవేరలేదు. మచ్చుకు కొన్ని కేసులను ఈ కింద ఇవ్వడమైంది.

6.1 హెల్త్‌సిటీ కోసం భూకేటాయింపు

విశాఖపట్నం జిల్లాలో హెల్త్ సిటీని నెలకొల్పడానికి చిన్నగాదిల గ్రామంలో 111.01 ఎకరాలను (నికరంగా ఉపయోగపడేది: 63.21 ఎకరాలు) ప్రభుత్వం ఏ.పి.ఐ.ఐ.సి.కి 2006 ఫిబ్రవరిలో బదలాయించింది. ఈ స్థలాన్ని ఏ.పి.ఐ.ఐ.సి. 18 ప్లాట్లుగా చేసి, వాటిలో 10 ప్లాట్లను (29.77 ఎకరాలు) పది ఆసుపత్రులకు 2006 జూలై - 2011 జనవరి మధ్యకాలంలో కేటాయించింది. ఐతే, స్థలాలను కేటాయించిన నాటి నుండి రెండేళ్లలోగా వారి ప్రాజెక్టులను పూర్తిచేయాలనీ, చికిత్స కోసం వచ్చిపోయే పేదరోగుల్లో 10 శాతం మందికీ, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకూ ఉచితంగా చికిత్సను అందించాలనీ నిబంధనలను విధించింది. వీటిలో ఆరు సంస్థలు, రూ॥40.38 కోట్ల ధరను చెల్లించి స్థలాలను స్వాధీనం చేసుకున్నాయి. (2006 జూలై -2010 సెప్టెంబరు). కానీ, 2011 జూలై నాటికి వీటిలో ఏ ఒక్కటీ కూడా వాటా యూనిట్లను నెలకొల్పలేదు.

అంతేకాక, స్థలం విలువకు సంబంధించి ఏ.పి.ఐ.ఐ.సి, ఈ పది సంస్థల నుండి ఒకేలాంటి ధరను వసూలు చేయలేదు. ఎకరానికి రూ॥2.45 కోట్ల నుండి రూ॥4.40 కోట్ల వరకు ధరకట్టారు. స్థలం విలువను వసూలు చేయడంలో కూడా ఏ.పి.ఐ.ఐ.సి. ఒకే విధమైన సమయసరళిని నిర్దేశించలేదు. ఒక సంస్థకు ఐదు సంవత్సర వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయించి, మిగతా సంస్థలను (1) ఒక వారంలోగా, (2) 20 రోజుల్లో (3) 90 రోజుల్లో చెల్లించమని కోరారు. రెండు సంస్థలకు స్థలం ధరలో ఐదుశాతం రాయితీనిచ్చారు. ఐతే, ఇతర సంస్థలకు ఈ రాయితీని వర్తింపజేయలేదు. ఆ విధంగా, భూకేటాయింపులు, వాటి ధరల చెల్లింపులకు సంబంధించిన షరతులను నిర్ణయించడంలో నిర్హేతుక విధానాన్ని అనుసరించారు.

6.2 మహేశ్వరం హార్డ్‌వేర్ పార్కుకు భూకేటాయింపు

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం, హార్డ్‌వేర్ పార్కులోని 58 యూనిట్లకు 2000 జూన్ - 2010 జూన్ మధ్యకాలంలో 615.43 ఎకరాల మేర ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగింది. కేటాయించిన ఈ భూములను ఇతర ప్రయోజనాలకు వినియోగించకూడదు. వీటిలో 36 యూనిట్లు (వీటికి కేటాయించిన భూమి 329.32 ఎకరాలు), స్థలాలను కేటాయించి ఏడాది నుండి పదకొండేళ్ల*[16] కాలం గడిచినప్పటికీ, వారు తమ ప్రాజెక్టులను అమలుచేయలేదు. కానీ, వీరిపై ఏ.సి.ఐ.ఐ.సి, ఎలాంటి చర్యనూ తీసుకోలేదు. అంతేకాక, ఐదు యూనిట్లకు*[17] హోటళ్లు, పెట్రోలు బంకులు, కార్యాలయాల వంటి వాణిజ్య అవసరాల కోసం 11.97 ఎకరాలను మళ్లించారు.

[16]* 2000లో 1 యూనిట్‌కు, 2004 1 యూనిట్‌కు, 2005లో 6 యూనిట్లకు, 2006లో 14 యూనిట్లకు, 2007లో 5 యూనిట్లకు, 2008లో 5 యూనిట్లకు, 2010లో 4 యూనిట్లకు స్థలాలను కేటాయించారు.

[17]* శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఫిల్లింగ్ స్టేషన్-1.12 ఎకరాలు, తాజ్ జి.వి.కె.హోటల్స్-1.52 ఎకరాలు, బియాస్ ప్రాజెక్టు ప్రై.లిమిటెడ్16.83 ఎకరాలు, రాగ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు - 1.50 ఎకరాలు

వాణిజ్యపరమైన వినియోగం కోసం భూములను మళ్లించడం, దేనికోసం అయితే భూములను కేటాయించారో ఆ ప్రాజెక్టులను అమలుచేయకపోవడం, నిబంధనలను ఉల్లంఘించినందుకు భూములను వాపసు తీసుకొనేలా, కేటాయింపును రద్దుచేసేలా చర్య తీసుకోవడంలో ఏ.పి.ఐ.ఐ.సి. వైఫల్యం మూలాంగా ఈ కేసులలో ప్రభుత్వ భూముల కేటాయింపు ఉద్దేశం మొత్తం నీరుగారిపోయింది.

6.3 భూములను వినియోగించని ఇతర సందర్భాలు

ఎంపిక చేసిన పదకొండు జిల్లాల్లో రికార్డులను తనిఖీ చేయగా, 2010కి ముందు వివిధ ప్రయోజనాలకోసం కేటాయించిన భూముల్లో, 5520.28 ఎకరాల భూములను వినియోగించని కేసులు మరికొన్ని వెలుగుచూసాయి. ఆ వివరాలు ఈ కింది పట్టికలో ఇవ్వడమైంది.

## పట్టిక -8

## భూములను వినియోగించని కేసులు వివరాలు

| వరుస సంఖ్య | సంస్థ పేరు | కేటాయించిన తేది | భూ విస్తీర్ణం | ఉద్దేశం | ప్రస్తు స్థితి |
|---|---|---|---|---|---|
| 1 | ఏ.పి.ఐ.సి., రాంపూర్ గ్రామం, వరంగల్ జిల్లా | 1985 | 72.14 ఎకరాలు, రాంపూర్ గ్రామం, వరంగల్జిల్లా | పారిశ్రామికాభివృద్ధి | ప్రరిశ్రమలను స్థాపించలేదు. |
| 2 | భారత్ ఉప్పు శుద్ధి కర్మాగారం, హైదరాబాద్ | 2001 జూలై | 6505 ఎకరాలు, పోలతిప్ప గ్రామం, కృష్ణాజిల్లా | ఆయోడైజ్డ్ ఉప్పు తయారీ పథకం | ఈ 6505 ఎకరాల్లో రూ॥16.25 కోట్ల విలువ గల 650 ఎకరాలను వినియోగించ లేదు. |
| 3 | జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, హైదరాబాద్. | 2002 మే | 0.40 ఎకరాలు ఇబ్రహీంబాగ్ గోల్కొండ (మండలం) | ప్రభుత్వ హాస్టల్ భవన నిర్మాణం కోసం | భవనాన్ని నిర్మించలేదు. ప్రహరీ గోడను మాత్రమే కట్టారు. |
| 4 | జిల్లా క్రీడల ప్రాధికార సంస్థ, ఎస్.పి.ఎస్. నెల్లూరు | 2002 | 9 ఎకరాలు, కావలి గ్రామం ఎస్.పి.ఎస్. నెల్లూరు జిల్లా | స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం | నిర్మాణాన్ని చేపట్టలేదు. |
| 5 | ఏ.పి.ఐ.ఐ.సి., అనంతపురం | 2002 నవంబర్ | 286.99 ఎకరాలు, గొల్లపూర్ గ్రామం, అనంతపురం జిల్లా. | ఇండస్ట్రీయల్పార్కు అభివృద్ధి | ఈ స్థలాన్ని ఏ.పి.ఐ.ఐ.సి. వినియోగించ లేదు. |
| 6 | న్యూలాండ్ ల్యాబ్, హైదరాబాద్ | 2004 డిసెంబర్ | 5.00 ఎకరాలు, నానక్ రామ్ గూడ, రంగారెడ్డి జిల్లా | ఔషధాలను కనుగొనే మరిశోధనా అభివృద్ధి కేంద్రనిర్మాణం ఐ.టి.సాఫ్టవేర్ | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 7 | విజువల్ సాఫ్ట్ టెక్నాలజీస్ ఇన్కార్పొరేషన్ హైదరాబాద్ | 2005 మార్చి | 15.61 ఎకరాలు నానక్ రామ్ గూడ, రంగారెడ్డిజిల్లా | ఐ.టి. సాఫ్ట్వేర్ | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 8 | పాఠశాలల డిప్యూటీ ఇన్స్పెక్టర్, హైదరాబాద్ | 2005 జూన్ | 0.49 ఎకరాలు, కందికల్ గ్రామం, బండ్ల గూడ మండలం | కార్యాలయ భవన నిర్మాణం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 9 | హైదరాబాదు మహానగరనీటి సరఫరా, పారిశుధ్యం బోర్డు హైదరాబాద్ | 2006 జూన్ | 4.00 ఎకరాలు, బండ్ల గూడ గ్రామం& మండలం | రిజర్వాయర్ నిర్మాణం | ఇంత వరకూ బోర్డు ఈ స్థలాన్ని వినియోగించ లేదు. |
| 10 | చమురు, సహజ వాయు సంస్థ (ఓ.ఎన్.జీ.సీ) హైదరాబాద్ | 2006 జూన్ | 2.60 ఎకరాలు, నానక్ రామ్ గూడ, రంగారెడ్డి జిల్లా | చమురు, వాయు సమాచార విశ్లేషణా కేంద్ర నిర్మాణంకోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 11 | ప్రకృతి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభికృద్ధి సంస్థ హైదరాబాద్ | 2006 జూన్ | 1.57 ఎకరాలు నానక్ రామ్ గూడ్, రంగారెడ్డిజిల్లా | ఉమ్మడి వసతులను కల్పిచేందుకు | ఈ భూమిని వినియోగించ లేదు. (కేసు కోర్టులో ఉంది. |
| 12 | ఆమేజాన్ఐ.టీ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ | 2006 డిసెంబర్ | 10.57 ఎకరాలు, నానక్రామ్ గూడ, రంగారెడ్డి జిల్లా | ఐ.టీ. సాఫ్ట్వేర్ పార్కు నిర్మాణం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. (కేసు కోర్టులో ఉంది. |
| 13 | ఏ.పి.ఐ.ఐ.పి, విశాఖపట్నం (సెజ్) | 2007 ఏప్రిల్ | 5595.47 ఎకరాలు, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు | రోడ్లు,నీరు, విద్యుత్వంటి మౌలిక వసతులను కల్పించడం | జూన్ 2011 నాటికి 3132.11 ఎకరాలభూమిని ఖాళీగాఉంచారు. |
| 14 | ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ హైదరాబాద్ | 2007 అక్టోబరు | 79.00 ఎకరాలు సర్వే నెంబర్లు 103/17,18, 19,20,/1, బండ్ల గూడ (గ్రామం & మండలం) | అల్పాదాయ వర్గాలకు గృహ నిర్మాణం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 15 | ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ హైదరాబాద్ | 2008 ఫిబ్రవరి | 13.45 ఎకరాలు, సర్వే నెంబర్లు 103/1 & 103/11, బండ్ల గూడ (గ్రామం &మండలం) | అల్పాదాయ వర్గాలకు గృహ నిర్మాణం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 16 | ఏ.పి.ఐ.ఐ.సి, అనంతపురం జిల్లా | 2008 సెప్టెంబరు | 402.10 ఎకరాలు,తుమ్మల గ్రామం, అమదగుర్ మండలం | అనంతపురం జిల్లాలో సైన్సు సిటీని నెలకొల్పడానికి | ఈ భూమిని వినియోగించ లేదు. |

| వరుస సంఖ్య | సంస్థ పేరు | కేటాయించిన తేది | భూ విస్తీర్ణం | ఉద్దేశం | ప్రస్తు స్థితి |
|---|---|---|---|---|---|
| 17 | మానస సొసైటీ, హైదరాబాద్ | 2009 జనవరి | 0.20ఎకరం, కొత్తపేట గ్రామం,ఉప్పల్ మండలం, రంగారెడ్డిజిల్లా | పాఠశాలను నిర్మించడం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 18 | సంజీవిని నేచర్‌క్యూర్ ఫౌండేషన్, హైదరాబాద్ | 2009 జనవరి | 1.00ఎకరం నజీబ్‌నగర్ గ్రామం,మొయినాబాద్‌మండలం,రంగారెడ్డి జిల్లా | ఈ ఫౌండేషన్ ఒక వైద్యశాలను నిర్మించాల్సి ఉంది. | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 19 | ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు హైదరాబాద్ | 2009 మార్చి | 2.50ఎకరాలు మైలాంరదేవ్‌పల్లి, బండ్లగూడమండలం | అల్పాదాయ వర్గాలకు గృహ నిర్మాణం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 20 | పల్నాడు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ | 2009 అక్టోబరు | 0.93 ఎకరం నానక్‌రామ్ గూడ, రంగారెడ్డి జిల్లా. | ఇన్‌క్యుబేషన్ కేంద్రాన్ని నిర్మించడం కోసంహోటల్ ప్రాజెక్టు | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 21 | 'వి' జోన్ హాస్పిటాలిటీ, హైదరాబాద్ | 2010 జనవరి | 1.23ఎకరాలు నానక్‌రామ్ గూడ, రంగారెడ్డి జిల్లా. | హోటల్ ప్రాజెక్టు | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 22 | టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టి.ఐ.ఎస్.ఎస్) ముంబాయి | 2008 జూన్ | 66.00 ఎకరాలు, మామిడిపల్లి,(గ్రామం) కొత్తూరు (మండలం) మహబూబ్ నగర్‌జిల్లా | విద్యా సంస్థ ఏర్పాటుకు | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 23 | సింబయోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, పూణె | 2008 జూన్ | 40.00ఎకరాలు, మామిడిపల్లి, (గ్రామం) కొత్తూరు (మండలం) మహబూబ్ నగర్‌జిల్లా | విద్యా సంస్థ ఏర్పాటుకు | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 24 | జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు | 2009 ఫిబ్రవరి & 2009 ఆగస్టు | జి.ఎల్.ఆర్. సర్వేనెం.502 &503 లో 10ఎకరాలు, జి.ఎల్.ఆర్. సర్వేనం.502 /పి2లో0.38 75 ఎకరం, బోయిన్‌పల్లి గ్రామం,తిరుమలగిరిమండలం, హైదారబాద్ | జాతీయ స్థాయి మానవ వనరుల సంస్థ అభివృద్ధి, గాంధీ ఆదర్శాల కేంద్రాలను స్థాపించడం కోసం | ఈ భూమిని వినియోగించ లేదు. |
| 25 | ఎమ్.ఏ.ఎస్. ఫాబ్రిక్ పార్కు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ | 2007 ఫిబ్రవరి | ఎస్.పి.ఎస్. నెల్లూరు జిల్లాలో 714 ఎకరాలు | 2009ఫిబ్రవరి లోగా వస్త్ర, దుస్తులపార్కునుఏర్పాటుచేసి 2014ఫిబ్రవరి లోగా31,000 మందికిఉపాధిని కల్పించాలి. | ఇంకా ఏర్పాటు చేయలేదు. |

నిర్దిష్టమైన ప్రయోజనాల కోసం కేటాయించిన భూముల వినియోగాన్ని ప్రభుత్వం/ఏ.పి.ఐ.ఐ.సి పర్యవేక్షించడం లేదని పై దృష్టాంతాలు సూచిస్తున్నాయి. ఇవి, ఇలాంటి కేటాయింపులను నిర్దేశించే లక్ష్యాలను వాస్తవంగా భంగపరచాయి. దీనివల్ల ప్రభుత్వ ఆస్తులను మార్కెట్ ధరల కంటే తక్కువకు సేకరించేందుకు మొగ్గు చూపే విశ్వసించదగని ఆపరేటర్లను ప్రోత్సహించడం, తమ స్వప్రయోజనాలకు ప్రభుత్వ భూమిని మళ్లించడం, దురభ్యాసాలకు ఒడిగట్టటంవంటివి జరిగే ప్రమాదం కూడా ఉంది. ◆

## ఈఆర్‌సీ లెక్కల ప్రకారం 2012 -13 లో నాలుగు డిస్కంల పరిధిలో వచ్చే నష్టాలు....

| డిస్కం | నష్టం (మినియన్‌యూనిట్లలో) | నష్టం (శాతం) |
|---|---|---|
| ఈపీడీసీఎల్ | 1936 | 12.77 |
| ఎస్‌పీడీసీఎల్ | 3240 | 14.94 |
| సీపీడీసీఎల్ | 6696 | 16.40 |
| ఎన్‌పీడీసీఎల్ | 2116 | 16.64 |
| **మొత్తం** | **13.989** | **15.48** |

ప్రస్తుతం 20 శాతం కన్నా ఎక్కువగా విద్యుత్ నష్టాలున్న జిల్లా/ప్రాంతం హైదరాబాద్ సౌత్ (48.53 శాతం). నిజామాబాద్ (30.31%) వరంగల్ (25.38%), కరీంనగర్ (20.78%)

## రాష్ట్రంలో విద్యుత్ నష్టాల తీరు.....

| సం॥ | నష్టం (శాతం) |
|---|---|
| 2008-09 | 18.63 |
| 2009-10 | 18.34 |
| 2010-11 | 17.51 |
| 2011-12 | 16.31 |

# స్థానిక ప్రభుత్వాలే మేలు

- ★ కోల్‌కతా అందరికీ ఆదర్శం
- ★ మున్సిపాలిటీలకు పూర్తిస్థాయి అధికారాలివ్వాలి
- ★ మెకెన్సీ అధ్యయన నివేదిక సూచన



పట్టణాలు నగరాలుగా... నగరాలు మహానగరాలుగా రూపాంతరం చెందుతున్నాయి. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పౌరులకు మెరుగైన సౌకర్యాల కల్పన, కాలానుగుణ సవాళ్లను అధిగమించడానికి ప్రస్తుత పరిపాలన విధానంలో కీలక మార్పులు చేయాలని.. అంతర్జాతీయ అధ్యయన సంస్థ మెకెన్సీ అభిప్రాయపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగా మున్సిపాలిటీ ల్లోనూ స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని సూచించింది. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థకు ఇచ్చిన నివేదికలో పలు కీలక విషయాలు పేర్కొంది. పెరుగుతున్న పట్టణీకరణతో 2030 నాటికి కొన్ని నగరాలు ప్రపంచంలోని కొన్ని ముఖ్యమైన దేశాల కన్నా పెద్దవిగా అవతరించనున్నాయని అంచనా వేసింది. దేశ జనాభా, పట్టణాల్లో నివసించే ప్రజల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని జాతీయస్థాయిలో ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేయాలని సూచించింది.

## కోల్‌కతా విధానం అనుసరణీయం

పట్టణీకరణ నేపథ్యంలో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో మాదిరి మున్సిపాలిటీల్లోనూ స్థానికి ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని మెకెన్సీ నివేదిక పేర్కొంది. రాజ్యాంగ సవరణ 74 ప్రకారం అన్ని అధికారాలను మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు అప్పగించాల్సి ఉంది. ప్రస్తుతం దేశంలోని దాదాపు అన్ని నగరాల పాలనలో బ్యూరోకాట్ల ప్రభావం ఎక్కువగా ఉంది. నగరాలు స్వయం సమృద్ధి సాధించేందుకు, మేయర్ జవాబుదారీగా ఉండేలా... కనీసం 35 నుంచి 40 నగరాల ప్రస్తుత పరిపాలన పద్ధతిలో మార్పులు చేయాలని నివేదిక పేర్కొంది. మేయర్ – కమిషనర్ విధానాన్ని అమలు చేయాలని సూచించింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా నగరం మాదిరిగా ఈ విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఈ విధానం ఇప్పటికే ఐరోపా, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లో అమల్లో ఉంది.

## ఏమిటి కోల్‌కతా విధానం...

కోల్‌కతా నగర పాలక సంస్థలో మేయర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా వ్యవహరిస్తారు. కమిషనర్ ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా ఉంటారు. మేయర్ ఇక్కడ ప్రజలకు జవాబుదారీగా ఉంటారు. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 141 వార్డులు ఉన్నాయి. కొన్ని వార్డులను కలిపి నగర నియోజకవర్గాలుగా ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం 15 నియోజకవర్గాలున్నాయి. ఒక్కో నియోజకవర్గంలోని వార్డు సభ్యులంతా కలిసి తమలో ఒకరిని ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు. ఇలా ఎన్నికైన 15 మంది సభ్యులు మేయర్ పాలక మండలి సభ్యులుగా ఉంటారు. పురపాలక సంఘాల ప్రధాన విధులను ఇక్కడ శాఖలుగా విభజిస్తారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, చెత్త నిర్వహణ, పార్కుల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, పౌరసంబంధాలు, జనన–మరణ ధృవీకరణ, శ్మశానాలు, ఆహార నాణ్యత, విద్య తదితర పనులను శాఖలుగా విభజించి పాలక మండలి సభ్యులకు కేటాయిస్తారు. ఆయా శాఖలను వారే పర్యవేక్షిస్తారు. మేయర్ కొన్ని ప్రధాన శాఖలతోపాటు ఇతరులకు కేటాయించని శాఖలను నిర్వహిస్తారు. తద్వారా కోల్‌కతా నగర బాధ్యతలన్నీ మేయర్‌వే. ◆

# ఒక జాగీర్దారు కథ

- బండారు రామ్మోహన్‌రావు

ఏ సమాజంలోనైనా భూమి ఎప్పుడైనా రాజ్యానిదే. దానిమీద అధికారం రాజుదే. హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించిన నైజాం రాజు తన భూముల్ని నజరానాగా ఇచ్చి రైతుల నుండి శిస్తు వసూలు చేసి ప్రభువులకు కట్టడానికి జాగీర్దారు వ్యవస్థ ఏర్పరచారు.

ప్రజలకు పంట పండించుకోడానికి ఆ భూముల్ని లీజుకి ఇచ్చి వాటిమీద పన్నుల్ని వసూలు చేసి ఇవ్వడానికి నైజాం రాజు రకరకాల పేర్లతో భూస్వామ్య వ్యవస్థను ఏర్పరచారు. అట్లా ఒక ఊళ్ళో ఒక జాగీర్దారు వుండేవాడు. ఆ ఊళ్ళో ఉన్న భూమిలో సగం కంటే ఎక్కువ ఆయన అధీనంలో వుండేది. ఆ జాగీర్దారు హైదరాబాద్‌లో ఉండేవాడు. ఆరేడు నెలలకు ఒకసారి గ్రామానికి వచ్చి వెళ్ళేవాడు. ఈ భూముల్ని ఆజమాయిషీ చేసి పన్నులు వసూలు చేయడానికి తనకింద ఒక గుమాస్తాను పెట్టుకున్నాడు. ఆ గుమాస్తాకి నెలకి వెయ్యి రూపాయల జీతం ఇచ్చేవాడు. జీతం తీసుకునే గుమాస్తా మెల్లమెల్లగా ఆస్తులు సంపాదించుకోవడం మొదలుపెట్టాడు. రైతుల నుండి వసూలు చేసే పన్నుల్లో ఎప్పటికప్పుడు కొంత డబ్బు నొక్కేసి కొత్త ఆస్తుల్ని సంపాదించుకున్నాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా మెల్లగా జాగీర్దారు గారికి చేరింది. గుమాస్తా రైతుల్నించి వసూలు చేసిన పన్నుల డబ్బుల్ని కాజేస్తున్నాడని ప్రజలు కూడా జాగీర్దారుకు ఫిర్యాదు చేసారు. జాగీర్దారుకి కోపం ఎక్కువ. "కోపం వస్తే కొరికి చంపుతాడు, ప్రేమ వస్తే కౌగిలించుకుంటాడు"ని ప్రజలు అనుకునేవారు. గుమాస్తా గురించి వినగానే జాగీర్దారుకి కోపం వచ్చింది. వెంటనే గుమాస్తాను పిలిపించి చెడామడా తిట్టేసి ఉద్యోగం నుంచి పీకేస్తున్నానన్నాడు. అప్పుడు ఆ గుమాస్తా జాగీర్దారు కాళ్ళా వేళ్ళా పడి "పాత తప్పులు ఇక చేయనని బుద్ధిగా వుంటాన"ని జాగీర్దారు కాళ్ళు పట్టుకున్నాడు. జాలితో కరిగిపోయిన జాగీర్దారు గుమాస్తాని ఈసారి వదిలేస్తున్నానని బుద్ధిగా పనిచేసుకోమని హెచ్చరించి వదిలేసాడు. కాని గుమాస్తా బుద్ధి మారలేదు. మళ్ళీ అటు జాగీర్దారును ఇటు ప్రజల్ని మోసగిస్తూ తన ఆస్తుల్ని అంతకంతకూ పెంచుకోసాగాడు.



ఈసారి గుమాస్తా అవినీతి గురించి తెలిసిన జాగీర్దారు గుమాస్తాని ఉద్యోగం నుంచి తీసేసాడు. అప్పుడు గుమాస్తా తన భార్యాపిల్లల్ని తీసుకెళ్ళి జాగీర్దారు కాళ్ళమీద పడేసాడు. తన కుటుంబానికి అన్యాయం చేయవద్దని, తనను బజారున పడేయవద్దని వేడుకున్నాడు. అప్పుడు ఆ జాగీర్దారు గుమాస్తాని క్షమించి వెయ్యి రూపాయల జీతంలో సగం కోత విధించి ఐదు వందల జీతాన్ని ఖరారు చేసాడు. అయినా గుమాస్తా మళ్ళీ చేసిన తప్పుల్నే చేయసాగాడు. మెల్లమెల్లగా జాగీర్దారు ఆస్తులు కరిగిపోతుంటే గుమాస్తా ఆస్తులు పెరిగిపోతున్నాయి. గుమాస్తా ఆస్తుల్ని లెక్క కడితే జాగీర్దారు కన్నా మించిపోయాడు. హైదరబాద్ నుంచి జాగీర్దారు తన భూముల్ని చూసుకోడానికి గ్రామానికి కారులో వచ్చేవాడు. ఆస్తులు కరిగిపోతుంటే బస్సులో రావడం మొదలైంది. ఖరీదైన సూటు బూటు వేసుకొనే జాగీర్దారు క్రమక్రమంగా పేదవాడైపోతూ చిరిగిన సూటు వేసుకుని గుమాస్తా దగ్గరికి వచ్చేవాడు. ఈసారి ఎలాగైనా గుమాస్తా పీడ వదిలించుకుందామని జాగీర్దారు గ్రామానికి వచ్చాడు. అప్పుడు

ఆ గుమాస్తా జాగీర్దారు గారికి పళ్ళు, ఫలాలు ఒక కొత్త సూటు బూటు సమర్పించుకుని ఇలా అన్నాడు. "అయ్యా తమరు నాకు జీతం ఇచ్చే స్థితిలో కూడా లేరని నాకు అర్థమయ్యింది." అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. మా తాతగారు మీ తాతగారి దగ్గరా, మా నాన్నగారు మీ నాన్నగారి దగ్గర, నేను మీ దగ్గరా మూడు తరాలుగా సేవకులుగా పనిచేస్తున్నాం. మీరు జీతం ఇవ్వకున్నా మీ దగ్గర నేను పనిచేస్తాను అని "సెంటిమెంటు" పండించాడు. అప్పుడు ఆ జాగీర్దారు గుమాస్తా త్యాగానికి ఆనందపడిపోయి కళ్ళనీళ్ళు పెట్టుకుని "నీలాంటి సేవకుడు లభించడం నా అదృష్టం" అన్నాడు. ఇక జీతం లేకుండా పనిచేసే సేవకుడు దొరికాడని సంతోషపడ్డాడు. మరో ఐదేళ్ళకు కాని గుమాస్తా నక్కజిత్తులు జాగీర్దారుకి పూర్తిగా అర్థం కాలేదు. అప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ గుమాస్తా పక్కటౌన్‌లో వందెకరాల భూమి నాలుగైదు ఇళ్ళతో పాటు ఒక సినిమా థియేటరు, ఒక పెట్రోలు బంకు ఇలా ఆస్తుల్ని కూడబెట్టుకోవడమే కాకుండా ఆ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యాడు. ఇప్పుడు జాగీర్దారు పరిస్థితి తారుమారు అయ్యింది. హైదరాబాద్‌లో వున్న ఇల్లు, దివానం అన్నీ అమ్మేసుకుని ఊళ్ళో ఉన్న భూమినే ఆధారంగా చేసుకుని బతకడానికి గ్రామానికి వచ్చాడు. కాని అక్కడ భూమి ఉంటేగా గుమాస్తా జాగీర్దారు భూములన్నింటిని ఎప్పుడో అమ్మేసాడు. జాగీర్దారుకి విలాసాల కోసం, విందుల కోసం డబ్బు ఖర్చుపెట్టిన ప్రతిసారి ఈ గుమాస్తా జాగీర్దారుతో ఎన్నో సంతకాలు చేయించుకునేవాడు. ఆ సంతకాలతోనే ఈ భూములన్ని అమ్మేసాడు. చివరికి జాగీర్దారుకి మిగిలింది ఆ గ్రామంలో పాడుబడ్డ ఇల్లు మాత్రమే. ఆ ఇంటిని బాగుచేయించుకుని ఉందామనుకున్నాడు. చివరికి ఆ ఇంటిని కూడా తనఖా పెట్టి గుమాస్తా బ్యాంకులో అప్పు తీసుకున్నట్లు తెలిసి బావురుమన్నాడు. ఇక గుమాస్తాను పిలిచి అడిగే ధైర్యం కూడా ఆయనకు లేదు. ఎందుకంటే ఇప్పుడు ఆయన మామూలు గుమాస్తా కాదు. నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా అయ్యాడు కదా!



ఇప్పుడు జాగీర్దారు ఎమ్మెల్యేగా మారిన గుమాస్తా దగ్గరికి వెళ్ళి చేతులు కట్టుకుని నిలబడవలసి వచ్చింది. తనకింత నిలువ నీడ ఇవ్వాల్సిందిగా గుమాస్తాని కోరాడు. మీ ఉప్పు తిని బతికాను మీరు ఇలా దీనంగా నన్ను అభ్యర్థించాల్సిన పనిలేదు. మీకు తగిన న్యాయం చేస్తానన్న గుమాస్తా ఇక నుండి నేనే మీకు నెలకి వెయ్యి రూపాయలు పంపిస్తాను. మీ దగ్గర ఇంత వరకు జీతం చేసినందుకు ప్రతిఫలంగా అన్నాడు.

**ఈ కథంతా వింటే మనం ప్రజాస్వామ్యంలో ప్రజలు, రాజకీయ నాయకులు ఇవన్నీ గుర్తొస్తున్నాయి కదా!**

ప్రజాస్వామ్యంలో పన్నులు కడుతున్న మనం ప్రభువులం. ఆ ప్రజలలాగా ప్రభుత్వాలకి మనమే వివిధ వస్తువులు కొన్నప్పుడు పన్నులు కడుతున్నాం. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వుంటున్న 'గుమాస్తా'లు మాత్రం ఈ పన్నుల డబ్బుల్ని నొక్కేస్తున్నారు. వాళ్ళు ధనవంతులు అవుతున్నారు. అందుకే ఇటు ప్రజల్ని అటు జాగీర్దారులను మించి సంపాదిస్తున్నారు. వాళ్ళే ఎంపీలు, ఎమ్మెల్యేలై అక్రమంగా దోచిన ధనాన్ని స్విస్‌బ్యాంకుల్లో దాస్తున్నారు. మనకు సేవ చేస్తామని వాగ్దానం చేసి మన ఓట్లను వేయించుకుని పదవులు పొందుతున్నారు. మనం కట్టే పన్నుల డబ్బుల్తో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. కాని ఆ సేవకులే మనకు రేషన్‌కార్డు, పెన్షన్, సబ్సిడీలు ఇతరత్రా సౌకర్యాల పేరుమీద మనకు బిచ్చం వేస్తున్నారు. ఎన్నికల్లో ఓటుకి ఐయిదు వందలో, వెయ్యి రూపాయలో పంచుతున్నారు. జాగీర్దారుకి ఎదురు జీతం ఇచ్చే గుమాస్తాలాగా మన డబ్బే దోచుకుని మళ్ళీ మనకే తాయిలాలు ఇస్తున్నారు. భూమి పోతే పోయింది ఎదురు జీతం వస్తుందన్న జాగీర్దారులాగా మనం అల్పసంతోష పడుతున్నాం. ఇది సాగినంత కాలం మనను దోచే గుమాస్తాలు పెరుగుతూనే వుంటారు. వాళ్ళ అక్రమ ఆస్తులు కూడా 'ఇంతింతైవటుడింతై' అన్నట్లు విశ్వవ్యాప్తమౌతాయి. మనం మాత్రం ఆ జాగీర్దారులాగా వున్నది పోగొట్టుకుని ఇంకా పేదరికంలోకి దిగజారిపోతాం. దీన్ని ఎదిరించాలి. **మన ఓటు అనే అయుధంతో రాజకీయ గుమాస్తాల్ని ఓడించాలి. మన పన్నుల డబ్బులకి మనమే రక్షణగా నిలబడాలి.** ■

## రాబోయే కొత్త చట్టం

# వివాహ నమోదు తప్పనిసరి

***దేశంలో వివాహాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి గురువారం కేంద్ర కేబినెట్ రెండు కీలకమైన బిల్లులను ఆమోదించింది. ఒకటి-వివాహాల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయటం, అదీ మత ప్రసక్తి లేకుండా! రెండోది సిక్కుల చిరకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ... సిక్కుల వివాహాలను 1909 నాటి ఆనంద్ వివాహ చట్టం కింద నమోదు చేసేందుకు ఉద్దేశించిన సవరణ తీసుకురావటం! చట్టపరంగా, చారిత్రకంగా ఈ రెండూ కూడా ఎంతో ప్రాధాన్యమున్న నిర్ణయాలే. వీటికి సంబంధించిన బిల్లులను ఈ నెల 24 నుంచి ఆరంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నట్టు కేంద్రం ప్రకటించింది. అసలీ సవరణల అవసరం ఎందుకొచ్చింది? వీటి ప్రత్యేకత ఏమిటి?***

### ఇక పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ తప్పదు

దేశంలో ప్రతి వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేయటం తప్పనిసరి చేస్తూ కేంద్ర కేబినేట్ ప్రత్యేక బిల్లును ఆమోదించటం వివాహ చట్టాల్లో కొత్త ద్వారాలు తెరుస్తోంది. మత ప్రసక్తి, ప్రస్తావన లేకుండా వివాహాన్ని రిజిస్టర్ చేయటమన్నది ఈ తాజా ప్రతిపాదనలో కీలకాంశం. ఇప్పటి వరకూ కూడా వివాహాన్ని రిజిస్టర్ చెయ్యాలంటే వధూవరులు తప్పనిసరిగా తమతమ మతాలను ప్రకటించుకోవాల్సి వస్తోంది. దీనివల్ల మతాంతర వివాహాలు చేసుకునే జంటు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. తమతమ మత పద్ధతులే పాటించాలంటూ ఇరు కుటుంబాలూ వారి మీద రకరకాల ఒత్తిళ్లు తెస్తూ, ఇబ్బందులు పెడుతున్నాయి. మత ప్రసక్తి లేకుండా రిజిస్ట్రేషన్ చేసే సదుపాయం కల్పిస్తే ఈ పరిస్థితిలో మార్పు వచ్చి, మతాంతర వివాహాలు చేసుకునే జంటలకు చట్టపరమైన రక్షణ కూడా లభిస్తుందని కేంద్రం భావిస్తోంది. ఇదే సమయంలో తమ వివాహాన్ని హిందూ వివాహ చట్టం కిందే రిజిస్టర్ చేసుకోవాలనుకునే వారికి ఎటువంటి ఇబ్బందీ ఉండదు, వారికి మత పరమైన గుర్తింపుతోనే వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.





### మతప్రసక్తి లేని పెళ్లి - స్త్రీలకు బాసట

ప్రస్తుతం దేశంలో లక్షలాది వివాహాలు ఎటువంటి చట్టపరమైన ధ్రువీకరణా లేకుండానే జరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వివాహ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయటం ద్వారా. అనందర కాలంలో ఏవైనా సమస్యలు తలెత్తితే స్త్రీలు వాటిని తేలికగా, చట్టపరంగా ఎదుర్కొనే వీలుంటుందని కేంద్రం భావిస్తోంది. వివాహ వివాదాలు, భరణం కేసులు, పిల్లల సంరక్షణ హక్కుల వంటి విషయాల్లో కూడా స్త్రీలు అనవసరంగా వేధింపులకు గురికాకుండా చూడటం వీలవుతుందని కేంద్రం భావిస్తోంది. నిజానికి వివాహ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చెయ్యాలంటూ 2006లోనే సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. 2006–07 పార్లమెంట్ మహిళా సాధికారిక కమిటీ నివేదిక, 18వ లా కమిషన్ రెండు నివేదికలు కూడా దీని అవసరాన్ని నొక్కి చెప్పాయి. దీంతో కేంద్రం కదలక తప్పలేదు. ప్రస్తుతం అమల్లో ఉన్న 1969 నాటి జనన, మరణ నమోదు చట్టానికే సవరణలు చేస్తూ, వివాహ రిజిస్ట్రేషన్‌ను కూడా అందులో చేరిస్తే వివాహాల నమోదు తేలిక అవుతుందని న్యాయమంత్రిత్వశాఖ ప్రతిపాదిస్తోంది.

### సిక్కుల కోసం... 1909 నాటి ఆనంద్ చట్టం!

దేశంలో జరిగే సిక్కు వివాహాలను బ్రిటిషు పరిపాలకులు

రూపొందించిన 1909 నాటి ఆనంద్ వివాహ చట్టం కింద నమోదు చేసేలా అనుమతిస్తూ కేబినెట్ ప్రత్యేక బిల్లును ఆమోదించటం విశేషం. సిక్కులకు సంబంధించినంత వరకూ దీన్ని ఎంతో కీలకమైన నిర్ణయంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ చట్టాన్ని అమలు చేయాలంటూ సిక్కు వర్గాలు ఎప్పటి నుంచో కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. నిజానికి ఈ చట్టాన్ని బ్రిటిషు ప్రభుత్వం ఆమోదించింది గానీ దేశ విభజనానంతరం దీన్ని తొలగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ సిక్కుల వివాహాలను కూడా హిందూ వివాహ చట్టం కిందే నమోదు చేస్తున్నారు. దీన్ని సిక్కులు ఆది నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఈ వ్యతిరేకతకు ప్రత్యేక నేపథ్యం ఉంది.





సిక్కుల వివాహ పద్ధతిని 'ఆనంద్ కారజ్' అంటారు. తమకంటూ ప్రత్యేకమైన వివాహపద్ధతి ఉన్నా కూడా తమ వివాహాలను హిందూ వివాహ చట్టం కిందే నమోదు చేయటం తగదని, అధికారిక పత్రాల్లో తమను ఇలా హిందువులుగా చూపించటమంటే తమకున్న స్వతంత్ర గుర్తింపును హరించటమే అవుతుందని సిక్కులు ఆందోళన చేస్తున్నారు. ఒక్క సిక్కులే కాదు, నిజానికి జైనులు, బౌద్ధులు వివాహాలను కూడా హిందూ చట్టం కిందే నమోదు చేస్తున్నారు. సిక్కుల డిమాండును ఆమోదిస్తే ఆ రెండు మత వర్గాల నుంచి కూడా ఇదే తరహా డిమాండ్లు రావచ్చన్న వాదన ఉంది. సిక్కుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావటమన్నది ఉమ్మడి పౌర స్మృతి అమలు చెయ్యాలన్న రాజ్యాంగంలోని 44వ అధికరణానికి విఘాతంగా నిలుస్తుందని కూడా న్యాయ మంత్రిత్వ శాఖ వర్గాలు కొంతకాలంగా వాదిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు, యూదులకు ప్రత్యేక వివాహ చట్టాలుండగా... మరి మా విషయంలోనే ఈ ప్రత్యేక వివక్ష ఎందుకు కొనసాగిస్తున్నారని సిక్కువర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హిందూ వివాహ చట్టంలోని 25వ అధికరణాన్ని తమకూ వర్తింపజేయటం ద్వారా సిక్కులను విస్తృత హిందూ సమాజంలో భాగంగా చూపించే ప్రయత్నం జరుగుతోందని, ఇది సమర్థనీయం కాదని వారు వాదిస్తున్నారు. వందేళ్ల క్రితమే బ్రిటిషు పాలకులు ప్రత్యేక సిక్కు పౌరస్మృతి అవసరమని గుర్తించగా నేటికీ భారత పాలకులు ఎందుకు దీన్నెందుకు గుర్తించటం లేదని వారు ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో సహా పలువురికి లేఖలు రాస్తున్నారు. మరోవైపు 2008లో పాకిస్థాన్ ప్రభుత్వం ప్రత్యేక సిక్కు వివాహ చట్టం తీసుకువచ్చింది. కేవలం 13,000 మంది సిక్కులు మాత్రమే ఉన్న పాకిస్థాన్ తమకు ప్రత్యేక చట్టం తీసుకురాగా.. 2 కోట్ల మంది సిక్కులున్న 'లౌకిక, ప్రజాస్వామ్య' భారత్ తమ ప్రత్యేక గుర్తింపును ఎందుకు నిరాకరిస్తోందని వీరు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం 1909 చట్టాన్ని పైకి తేవటం ద్వారా ఈ ప్రత్యేక సిక్కు వివాహ చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

## ఏమిటీ ఆనంద్?

'ఆనంద్ కారజ్' అన్నది సిక్కు వివాహ పద్ధతి. కులాల ప్రసక్తి లేని, కట్నం ప్రస్తావన, తంతు అంతగా లేని సులభమైన వివాహ విధానం ఇది. దీన్ని గురు అమర్‌దాస్ (1479-1574) ప్రవేశ పెట్టారు. అనంతరం గురు రామ్ దాస్ దీన్ని సిక్కువర్గాల్లో బాగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అప్పట్లో ఇది విస్తతంగా అమల్లో ఉన్నా మహారాజా రంజిత్ సింగ్ కాలంలో కొంత వెనకబాట పట్టింది. తిరిగి 19వ శతాబ్దంలో నామ్‌ధారి ఉద్యమం దీన్ని ప్రోత్సహించింది. అయితే సిక్కులను హిందూ సమాజంలో భాగంగానే పరిగణించే బ్రాహ్మణ పురోహిత, ఆర్యసమాజ వర్గాలు– పురోహితుల అవసరమే లేని, ఎటువంటి ఆర్భాటాలు లేని ఈ వివాహ విధానాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. 1909లో బ్రిటిషు ప్రభుత్వం చట్టం చేసినా స్వాతంత్ర్యానంతరం దీనికి చట్టబద్ధత లేకుండాపోయింది. దీన్ని 'శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ' ఆమోదిస్తోంది. సిక్కులంతా ఆనందంతో ఆమోదించి, జరుపుకొనే ఈ వివాహం గురుద్వారాల్లోనే జరుగుతుంది. ◆

# అంగన్‌వాడీల తీరు అధ్వానం

## ప్రభుత్వ సామాజిక తనిఖీలో వెల్లడీ

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అధ్వాన్నంగా ఉంది. లక్షిత వర్గాల్లో 50 శాతం మందికి అంగన్‌వాడీ కేంద్రాల వల్ల ప్రయోజనం కలగడంలేదు. పేదరికంతో అల్లాడే గర్భిణీలకు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య సంరక్షణ, పాఠశాలలకు వచ్చేలా చూడటంలో కీలక పాత్ర పోషించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ విషయం ప్రభుత్వం నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైంది. పేద మహిళలకు, చిన్నారులకు ఉపయోగపడేలా చేపట్టిన సమీకృత పిల్లల అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) అమలు జరుగుతున్న తీరు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై 2008, 2009లో సామాజిక తనిఖీ జరిగింది. మాజీ ఐఏఎస్ అధికారి, ప్రధాన మంత్రి కార్యాలయం పూర్వపు కార్యదర్శి కె.ఆర్.వేణుగోపాల్ నేతృత్వంలో ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు 129 గ్రామాల్లోని 156 అంగన్‌వాడీ కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ నివేదికను పుస్తక రూపంలో వేణుగోపాల్ వెలువరించారు. ఇందులో వెలుగులోకి వచ్చిన ఆసక్తికర అంశాలు కొన్ని...

- ★ ఉప్మా, కిచిడీ.... ఏదీ తినలేం
- ★ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి ఇదీ
- ★ అరకొర పౌష్టికాహారం సరఫరా
- ★ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ॥10 వేల జీతం ఉండాలి
- ★ నియామకాల్లో ఎమ్మెల్యేల జోక్యం వద్దు

✦ అనేక చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు తెరచి ఉంచటంలేదు. అంగన్‌వాడీ వర్కర్‌కు కనీస జీతం రూ॥10వేలు ఉండాలి. అంగన్‌వాడీ కార్యకర్తల ఎంపిక కమిటీలో ఎమ్మెల్యే సభ్యుడుగా ఉండరాదు.

✦ సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరా జరగడంలేదు. ఎక్కువ కేంద్రాల్లో పిల్లలు పౌష్టికాహార లోపంతో సతమవుతున్నారు. ఉదయం పిల్లలు రాగానే ఓసారి, మధ్యాహ్నం మరోసారి పౌష్టికాహారం సరఫరా చేయాలి. అయితే చాలా కేంద్రాల్లో ఇలా జరగడం లేదు.



- 2008లో సామాజిక తనిఖీ ప్రారంభమయ్యే సమయానికి కొద్ది ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపట్టిన 'వండేందుకు సిద్ధం' (రెడీ టు కుక్) విధానంలో ఆహారపదార్థాలుగా ఉప్మా, కిచిడీ, హల్వా ఉన్నాయి. ఇది వండిన కొద్ది సేపటికే గట్టిపడి తినడానికి వీల్లేకుండా తయారవుతున్నాయని పలువురు తెలిపారు.
- 96 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అదనపు పౌష్టికాహారం సరఫరా సక్రమంగా జరగలేదు. ఆరేళ్లలోపు పిల్లలకు విటమిన్-ఎ, రక్తహీనత లేకుండా చూడటానికి అవసరమైన మాత్రలు ఇవ్వాల్సి ఉంది. అనేక చోట్ల పౌష్టికాహారాన్ని ఇంటికి తీసుకెళ్లడం వల్ల గర్భిణీలు, పిల్లలు కాకుండా ఇంట్లో ఉన్న మగవాళ్లు తినేయడం వల్ల లక్ష్యం నెరవేరలేదు.
- 61 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 0-3 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలందరూ నమోదుకాలేదు. 93 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల నమోదుకు కేంద్రాలకు వస్తున్న పిల్లల సంఖ్యకు పోలికలేదు.
- 74 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 3-6 సంవత్సరాల మధ్యవయస్సు గల పిల్లలు నమోదు కాలేదు. కొన్ని కేంద్రాల్లో గ్రామాల్లో ఉన్న పిల్లల సంఖ్య కంటే హాజరైనట్లు నమోదు చేసిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది.
- 58 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణీల నమోదు జరగలేదు. దళితవాడల్లో అంగన్‌వాడీ కేంద్రాలుంటే ఇతర వర్గాల వారు నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపలేదు. దీంతో పౌష్టికాహారంలోపం, ఆరోగ్య రక్షణ సక్రమంగా లేక పిల్లలు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.
- 44 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆయాలు సరిగాలేరు.
- ఎక్కువ అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన వసతిలేదు. అత్యధిక కేంద్రాలు అద్దె ఇళ్లలోనే కాలం సాగదీస్తున్నాయి. ◆

# విద్యుత్ నష్టాలకు కళ్ళెం వేస్తే కష్టాలకు చెల్లు

రాష్ట్రంలో విద్యుత్ నష్టాల తీవ్రత, వాటిని కనీస స్థాయికి తగ్గిస్తే కలిగే ప్రయోజనాలను ఈ గణాంక సమాచారం పట్టి చూపుతోంది. నష్టాల నియంత్రణ ద్వారా కరెంటు కోతల నుంచి రాష్ట్రం బయటపడటమే కాకుండా విద్యుత్ సంస్థలూ ఆర్థిక నష్టాల నుంచి గట్టెక్కేందుకు అవకాశం ఉంది. పర్యవేక్షణ మెరుగుపరచడం, నిర్వహణ సామర్థ్యం పెంచడం, ఆధునిక పద్ధతుల్ని అనుసరించడం ద్వారా అదనపు పెట్టుబడి లేకుండానే రాష్ట్ర ప్రజల కరెంటు కష్టాలకు తెరపడుతుంది. నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది ఆచరణ సాధ్యమని ఎక్కడో విదేశాల్లోనో, ఇతర రాష్ట్రాల్లోనో కాదు. మన రాష్ట్రంలోనే ఈపీడీసీఎల్ (విశాఖపట్నం) రుజువు చేసింది. 2011-12 లో రాష్ట్ర సగటు విద్యుత్ నష్టాలు 16.45 శాతంగా ఉంటే.. ఈపీడీసీఎల్ పరిధిలో ఇది 6.96 శాతానికి తగ్గాయి. మిగిలిన మూడు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంల) పరిధిలో ఈ మేరకు నష్టాలను పరిమితం చేయగలిగినా రాష్ట్ర ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది. అయితే ఈ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు.

**విద్యుత్ నష్టాలను తగ్గిస్తే ఛార్జీలు పెంచనవసరం లేదు**

**ప్రస్తుతం రాష్ట్రంలో ఏడాది విద్యుత్ అవసరాలు 80620 మిలియన్ యూనిట్లు**

**కానీ సరఫరా అయ్యేది 77401 మిలియన్ యూనిట్లు**

**ఏర్పడుతున్న లోటు 3219 మిలియన్ యూనిట్లు**

**ఫలితం - ప్రజలకు, పరిశ్రమలకు విద్యుత్ కోతలు!**

**వేల కోట్ల రూపాయల పన్ను రాబడి, వస్తూత్పత్తి నష్టం!**

**రాష్ట్రంలో విద్యుత్ నష్టాల శాతం 16.45**

**నష్టపోతున్న విద్యుత్ 12732 మిలియన్ యూనిట్లు**

**అంటే - నాలుగో వంతు నష్టాన్ని అరికట్టినా కరెంటు లోటు ఏర్పడదు !**

**నష్టాన్ని బాగా తగ్గించగలిగితే విద్యుత్ మిగులు ఏర్పడుతుంది. దానిని అమ్ముకుంటే ఆదాయమూ వస్తుంది. !**

**విద్యుత్ నష్టాలతో కోల్పోతున్నది 12732 మిలియన్ యూనిట్లు**

**సగటు వ్యయం అంచనా... యూనిట్‌కు రూ. 4.42**

**ఈ లెక్కన ఏర్పడుతున్న నష్టం రూ.5627.54 కోట్లు**

**మొన్న కరెంటు ఛార్జీల పెంపుతో ప్రజలపై సర్కారు వేసిన భారం రూ. 4,442 కోట్లు**

**అంటే... కరెంటు నష్టాలను నివారిస్తే ఛార్జీల పెంపు తప్పేదే!**

## పెరుగుతున్న వలసలు - సగం జనాభా పట్టణాల్లోనే

# ఇక నగర భారతమే

- ముందుందు భారీగా పెరగనున్న వలసలు
- 2003 నాటికి హైదరాబాద్ జనాభా 98 లక్షలు
- అంతర్జాతీయ మెకెన్సీ సంస్థ అంచనా

వచ్చే 20 ఏళ్లలో పట్టణాలన్నీ జనసంద్రాలుగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు భారీగా పెరగటమే ఇందుకు కారణం కానుంది. 2030 నాటికి రాష్ట్ర జనాభాలో దాదాపు సగం జనాభా పట్టణాల్లోనే నివసిస్తారని తాజాగా మెకెన్సీ అంతర్జాతీయ సంస్థ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా పట్టణాల్లో పరిస్థితులు, ఆర్థిక అభివృద్ధిపై అధ్యయనం చేసిన ఈ సంస్థ ఓ నివేదికను రూపొందించి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు అందజేసింది. 2030 నాటికి రాష్ట్ర జనాభాలో సగానికి పైగా పట్టణ జనాభా కలిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉండొచ్చని పేర్కొంది. తొలి ఐదు స్థానాలను తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్‌లు ఆక్రమించుకున్నాయి.

- ✦ 2030 నాటికి తమిళనాడు రాష్ట్ర జనాభాలో 67% (5.34కోట్లు) మంది పట్టణాల్లోనే నివసిస్తారు. వేగంగా పట్టీకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు ఇప్పటికే అగ్రస్థానంలో ఉంది.
- ✦ ఆంధ్రప్రదేశ్ జనాభాలో 46% అంటే 4.55 కోట్ల మంది పట్టణాల్లో నివసించనున్నారు. పట్టణ జనాభా ప్రాతిపదికన చూస్తే రాష్ట్రానిది ఐదో స్థానం.
- ✦ పట్టణీకరణ నేపథ్యంలో ఉద్యోగాలు కూడా ఆ స్థాయిలోనూ పెరగనున్నాయి. పట్టణాల్లో మరో 70% ఉద్యోగాలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి.
- ✦ దేశంలో 40% లక్షల జనాభా దాటిన నగరాల సంఖ్య 13కు చేరుకుంటుంది. అందులో హైదరాబాద్ ఏడో



స్థానంలో ఉండనుంది. నగర జనాభా 98 లక్షల వరకు చేరుకోవచ్చు.

- ✦ హైదరాబాద్ నగర స్థూల జాతీయ ఉత్పత్తి రూ॥3,35,000 కోట్లకు చేరొచ్చు. స్థూల తలసరి జాతీయోత్పత్తి రూ॥3.4 లక్షలుగా ఉండొచ్చు.
- ✦ 2030 నాటికి స్థూల జాతీయ ఉత్పత్తిలో పట్టణాల వాటా 70 శాతానికి ఎగబాకుతుంది.
- ✦ హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో మెరుగైన సౌకర్యాల కోసం రానున్న 20 ఏళ్లకు గాను ఏడాదికి తలసరి రూ॥12,300 పెట్టుబడిగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- ✦ ప్రస్తుతం నగరాల్లో తలసరి తాగునీటి సరఫరా రోజుకి 105 లీటర్లు. దీనిని 220 లీటర్లకు పెంచాల్సి ఉంటుంది. పట్టణాల్లో ప్రజా రవాణా వాటా 30 నుంచి 82 శాతానికి పెంచాల్సి ఉంది.
- ✦ లేఅవుట్లలో పార్కులు ఇతర అవసరాల కోసం ప్రస్తుతం వదిలిపెడుతున్న ఖాళీ స్థలం 2.7 శాతం కాగా.. దీన్ని 16 శాతానికి పెంచాల్సిన అవసరముంది.
- ✦ ప్రస్తుతానికి పట్టణ జనాభాలో 24% మంది మురికివాడల్లోనే నివసిస్తున్నారు. 2030 నాటికి దేశవ్యాప్తంగా మురికివాడలు లేకుండా అన్ని నగరాలను అభివృద్ధి చేయాలి.
- ✦ మురికివాడల రహిత పట్టణాల కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా రూ॥15వేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉంటుంది.
- ✦ ఆస్తిపన్ను వినియోగ ఛార్జీలపై పట్టణాలు ఇకపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. నిర్వహణ భారానికి తగ్గట్టు వసూళ్లు ఉండాలి.
- ✦ సమర్థవంతగా భూమి వినియోగం కోసం కచ్చితమైన ప్రణాళిక అవసరం. పక్కా ప్రణాళిక నిర్మాణాలతో కనీసం 6.2 మిలియన్ హెక్టార్ల భూమిని పరిరక్షించుకోవచ్చు.
- ✦ ఆర్థికంగా వెనుకబడిన మూడు, నాలుగో శ్రేణపట్టణాల్లో జనాబాకు అనుగణంగా ప్రతి ఏడాది తలసరి రూ॥1000 అదనంగా సహాయం చేయాలి. ప్రభుత్వం గ్రాంట్లు, భూముల ఆదాయాలను మున్సిపాలిటీలు, నగర పాలకసంస్థల మధ్య సమానంగా పంచాలి. ◆

## విద్యార్థుల్లారా ఉన్నత చదువులే ముద్దు

విద్యార్థుల్లారా
ఉద్యమాలు వద్దు
ఉన్నత చదువులే ముద్దు
విప్లవాలు వద్దు
వినయ విధేయతలే ముద్దు
ఉద్యమాలు ఊపిరి తీస్తాయి
ఉన్నత చదువులు బంగారు భవిష్యత్తునిస్తాయి
విప్లవాలు అమరుణ్ణి చేస్తాయి
వినయ విధేయతలు ఆత్మీయుల్ని చేస్తాయి
యువకుల్లారా
స్వార్థ నాయకుల కోసం బలికావద్దు
విలువైన జీవితాన్ని పాడు చేసుకోవద్దు
కార్లలో తిరిగేది నాయకులు
కాలినడకన తిరిగేది అమాయకులా!
పదవీకాంక్ష నాయకులది
ప్రాణాత్యాగం కార్యకర్తలది
అధికార దాహం పాలకులది
పరాకాష్ట పోలీసులది
శిక్షించబడేది సామాన్యులు
రక్షించబడేది నాయకులా!
అభిమానులది త్యాగం
అయితే ప్రజాప్రతినిధులది స్వార్థం
కష్టాలు ప్రజలకు
సన్మానాలు పాలకులకా!
మేధావుల్లారా మీరూ ఆలోచించండి
ఆత్మహత్యలు చేసుకునేది అనుచరులు
ఆత్మరక్షణ చేసుకునేది నాయకులా!
నమ్మి వచ్చినవారిని వంచన చేయడమేనా రాజకీయమంటే
నేతల ప్రజాసేవ అంటే ఇదేనా!

**కె. సురేష్‌బాబు**, కరీంనగర్

# దాశరథి - జ్వాలాతోరణమాల

- ఆర్వీయార్

ఇరవయ్యో శతాబ్దం సగం గడిచింది. భారతదేశానికి పరాయిపాలన నుంచి విముక్తి లభించింది. కవిత్వ సీమలో వచనకవిత్వ రూపం కవికి స్వేచ్ఛని ప్రసాదించింది. స్వాతంత్ర్య పోరాటం దాకా సాహిత్యంలో, కళల్లో వస్తువు యెలాంటిదై వుండాలన్న విషయమై తడుముకోనక్కర్లేకపోయింది. ముందు పారతంత్ర్యం పోవాలి. దాని మీదనే దృష్టి లగ్నం అయింది. దాన్ని అనుసరించి పీడితులకు విముక్తి, అందరికీ స్వేచ్ఛ, సౌఖ్యప్రదమైన జీవితం వస్తాయన్న కోరిక వుండేది. కృత్రిమత్వానికి చోటు లేకుండా కవి మనస్సుని వెల్లడి చేసే సాధనంగా వచన కవిత్వ రూపం ఎదిగి వచ్చింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బ్రిటీష్‌వాళ్ల హయాం నుంచీ వున్న సంస్థానాల పరిస్థితి భిన్నంగా వుంది. సంస్థానాధీశులు తమ తమ సంస్థానాల్లో పరమ కర్కశంగా పాలన సాగించారు. నియంతృత్వం రూపుకట్టి అక్కడ పెత్తనం చలాయించింది. అలాంటి సంస్థానాల్లో పెద్దది నైజాం పాలన కింద వున్న ప్రాంతం. అధిక భాగం తెలుగుగడ్డ. అంచుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు వున్నాయి. నైజాం నవాబు పాలనలో వున్న తెలుగు ప్రాంతం తెలంగాణా. బ్రిటీష్ వాళ్లు సంస్థానాధీశులకు భారతదేశంలో భాగంగానేనా వుండచ్చు లేదా స్వతంత్రించవచ్చు అంటూ వరం యిచ్చారు. ఓ పక్క దేశం రెండు ముక్కలై పాకిస్తాన్ అనే పేరుతో ఒక భాగం విడిపోయింది. ఇలాంటి మెలికతో దేశంలోనే ఏకతకు ముప్పు వచ్చేటట్టు అయింది.

నైజాం స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకోవాలని ప్రయత్నించాడు. ఐక్యరాజ్యసమితికి కూడా ప్రతినిధిని పంపించ చూశాడు. ఆ నేపథ్యంలో నైజాం దేశంలో అంతర్భాగం కావడం కోసమూ, నైజాం నిరంకుశ పాలన అంతమొందడం కోసమూ పోరాటం సాగింది. అసలు నైజాం పాలనకి వ్యతిరేకంగా అంతకు ముందు నలభైయేళ్ల నుంచీ తెలంగాణా ప్రజానీకం పోరాడుతూనే వుంది. కనీస పౌరహక్కులు కూడా లేని ఆ ముష్కర పాలనలో ప్రజాస్వామ్య హక్కుల కోసం, మాతృభాషకు సరైన



దాశరథి కృష్ణమాచార్యులు

జననం 1925, జూలై 22 మరణం 1987, నవంబర్

ఆదరణ కలగడం కోసం, పీడననంత మొందించడం కోసం పోరాటం సాగుతూనే వుంది. 'ఆంధ్ర మహాసభ' కార్యకలాపాలు అలా పెరుగుతూ, విస్తరించుకుంటూ భారతదేశం స్వాతంత్ర్యం పొందే నాటికి జనంలో అపారమైన రాజకీయ చైతన్యం కలగడానికి తోడ్పడ్డాయి. భారతదేశం విముక్తం అయింది. తెలంగాణాకి ఆ అదృష్టం పట్టలేదు. దాంతో ప్రజా చైతన్యం సాయుధ తిరుగుబాటు దిశగా దారి తీసింది. నైజాం పునాదులు కదల నారంభించాయి. భారతదేశంలో పదవి అందుకున్న జాతీయ నాయకత్వం పోలీసు చర్య జరిపి, నైజాం రాజ్యాధికారాన్ని తప్పించింది. మిగిలిన దేశంతో బాటు తెలంగాణా ప్రాంతం కూడా జాతీయ నాయకత్వం పాలన కిందకి వచ్చింది. అయితే సాయుధ పోరాటం దిశ గురించిన

తర్జన భర్జనలు జరిగాయి. అవన్నీ రాజకీయపరమైన అంశాలు. ప్రస్తుతం మనం చూడవలసింది తెలంగాణా పోరాటం చరిత్రలో యెంత గణనీయ స్థానం సంపాదించిందీ, కవులూ కళాకారులూ యెలా స్పందించారు అన్న విషయాలని.

**తెలంగాణా ఆ రోజుల్లో కావ్యాలకి యితివృత్తం. తెలంగాణా ఆ రోజుల్లో సాహిత్యానికి వస్తువు. తెలంగాణా ఆ రోజుల్లో కళలకి ప్రేరణ. తెలంగాణా సాయుధ పోరాటం, గెరిల్లా సమరం కవిత్వంలో ప్రతిధ్వనించాయి. ఆ ప్రతిధ్వనిలో ఒక గొంతుక దాశరథిది.** ఎంతో గట్టిగా అరిచిన గొంతు అది. తెలంగాణా విముక్తి పోరాటం కేవలం భూస్వామ్య నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం అని కొందరు భావించారు. అంచేత జాతీయ స్రవంతిలో చేరగానే దానికి ఫలసిద్ధి జరిగిందనుకున్నారు, అలా కాక మరింత ముందుకు పోయి తాడిత పీడిత జన విప్లవ విముక్తికిది భూమిక అని కొందరు భావించారు. ఆ భేదం వల్లనే పోరాటం కార్యరంగాల్లో అనుసరించవలసిన యెత్తుగడల విషయమై చర్చలు రేగాయి. 'తెలంగాణా' కుందుర్తి, ఆరుద్ర, గంగినేని, రెంటాల, కాళోజీ లాంటి కవులందరికీ యితివృత్తమైంది. దాశరథికి అది మరింత పదునైన రీతిలో భాసించింది ఒట్టి భూస్వామ్య వ్యతిరేక పోరాటమే కాదు మరింత విశాలస్థాయి విముక్తి పోరాటంగా కనిపించింది. దాశరథి జాతీయోద్యమ ప్రభావానికీ, మార్క్సిస్టు ప్రభావానికీ కూడా ప్రతినిధి అయ్యాడు. దాశరథి అభ్యుదయ దృక్పథాన్ని ఆయన కవిత్వం యెత్తి చూపెడుతుంది. ఆయన ప్రభావం ఆ ఉద్యమ నేపథ్యంతో కవిత్వం మీద బలంగా వుంది.

దాశరథిగా ప్రసిద్ధుడైన యీ జ్వాలాతోరణం దాశరథి కృష్ణమాచార్యులు. 1927 సెప్టెంబర్లో ఖమ్మంజిల్లా గూడూరులో జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టభద్రుడయ్యాడు. నైజాం పాలనకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా పోరాటంలో దూకి, జైలుశిక్షలు అనుభవించాడు. జైల్లో గోడ మీద బొగ్గుతో–

**'ఓ నిజాము పిశాచమా, కానరాడు**
**నిన్ను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణా కోటిరతనాల వీణ'**

అని సాహసోపేతంగా రాసిన 'అగ్నిధార' దాశరథి. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడుగా వున్నాడు. కవిత్వంలో నూతన రీతిని, సామాజిక అభ్యుదయాన్ని త్రికరణ శుద్ధిగా కాంక్షించాడు. దాశరథి రక్తంలో కవిత్వం ప్రసరిస్తుంది. ఆంధ్ర, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులందుకున్నాడు. కళాప్రపూర్ణ, డాక్టరేట్ లాంటి గౌరవ పట్టాలు అందుకున్నాడు. 1987 నవంబరులో మరణించాడు.

పద్యాలు రాశాడు. పద్యకవిత్వంలో అభ్యుదయ భావాలనే గుప్పించాడు. మాత్రాబద్ధ గేయాలు రాశాడు. పోరాట ప్రతిధ్వనులే వినిపించాడు. వచన కవిత్వం రాశాడు. సామ్యవాద భావాలనే పల్లవించాడు. 'హృద్యమైన పద్యం నుండి, శ్రవణపేయమైన గేయం నుండి, రుచికరమైన వచనకవిత దాకా అన్ని ప్రక్రియలనూ ఆహ్వానించాడు. **పోరాటంలో నుండి కళ పుడుతుందని నమ్ముతున్నాను. నా జీవితమే పోరాటం' అని సగర్వంగా ప్రకటించుకున్నాడు.** పద్యానికీ వచన కవిత్వానికీ తేడా గుర్తించి వివరించాడు. 'విద్యుత్‌లా ఊహించగల మనకు మద్యంలా పారే పాత ఛందస్సు పనికి రాదు' అని వచన కవిత విద్యుత్‌ని అందించాడు. దాశరథి బహుముఖ ప్రజ్ఞావంతుడు. ఉర్దూ, పర్షియన్ భాషల్లో నిష్ణాతుడు. అభ్యుదయ భావాలని విస్తారంగా ప్రచారం చేశాడు. ఆధునికతకీ వచన కవిత్వానికీ గల వస్తురూప సమన్వయాన్ని గుర్తించాడు.

దాశరథి అగ్నిజ్వాలలా యెగసే భావాలతో బాటు లలిత మధురమైన శృంగార భావాలనీ కవిత్వంలో చూపించాడు. సాధారణంగా అయితే అభ్యుదయ కవిత్వ దృక్పథానికి పొసగని సందర్భం యిది. కానైతే ఈ రెండు లక్షణాలూ జీవితంలో భాగమైనవే కాబట్టి ఉర్దూ కవిత్వంలో యివి సమసిస్తూ దర్శనమిస్తాయి. మఖ్దూం మొహియుద్దీన్, సర్దార్ జాఫ్రీ లాంటి కవుల్లో యీ సాంప్రదాయం వుంది. దాశరథి ఉర్దూ సాహిత్య పరిచయం దీనికి ఆధారం కావచ్చు. ఉర్దూ సాహిత్య పరిచయం వల్ల గాలిబ్ గజల్లని తెలుగు కవిత్వానికి అందించాడు. దాశరథి జాతీయవాది. సామ్యవాది. శాంతివాది. 'రానున్నది యేది నిజం – అది వొక్కటె సోషలిజం' అని ఆశావహంగా ఆలాపించాడు. **దాశరథి అంటే తెలంగాణా, తెలంగాణా అంటే దాశరథి అనిపించేటంతగా తెలంగాణానీ, పీడిత ప్రజల విముక్తి కాంక్షనీ తన కవిత్వంలో ప్రతిఫలింపచేశాడు.** ◆

# ప్రస్తుత రాజకీయ సంస్కృతి

## - ఒక విశ్లేషణ

- డా॥ వి.వి. రామారావు

ఏ దేశమయినా అభివృద్ధి సాధించి. ఆధునీకరణ చెందాలంటే అందుకు శాంతి భద్రతలు అత్యంత ఆవశ్యకం. ఐతే మన దేశంలో శాంతి భద్రతలు కాపాడే వ్యవస్థ పూర్తిగా నశించిపోయింది. అరాచకాలు విశృంఖలమైన అవినీతి, పూర్తిగా దిగజారిపోయిన నైతిక విలువలు సమాజాన్ని, తద్వారా దేశాన్ని మరింత దిగజారుస్తున్నాయి ! ఈ దుర్భర అరాచకానికి, రాజకీయాన్ని పూర్తిగా వ్యాపారం చేసి అందులో అడుగు పెట్టిన ప్రతి వ్యక్తి (కొద్ది మినహాయింపులతో) పూర్తిగా భాద్యులు ! ప్రజలు ఎప్పుడూ మంచి వారే వారిని వక్రమార్గంలో నడిపించి, సమాజ వినాశనానికి కారకులయిన రాజకీయ నాయకులదే కీలక భాద్యత !

ఈ నాటి విషమ పరిస్థితులకు బీజం 1966 సంవత్సరంలో నాటబడింది. విభిన్న సంస్కృతులతో  అవినీతి, స్వార్ధ నాయకత్వం, వ్యక్తి పూజ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయుట వాటితో పాటు వారసత్వ రాజకీయాలు ప్రవేశపెట్టబడటంతో, దేశం పూర్తిగా నాశనమవటానికి దోహదపడ్డాయి. మహనీయుడు లాల్‌బహదూర్ శాస్త్రి అకాలమరణంతో మన దేశానికి ఈ దుస్థితి దాపురించింది. ఏ దేశమయినా అవినీతి వలన నశించింది కాని ద్రారిద్ర్యం వల్ల కాదన్న నా నుడి నిజమయింది ! దీనికి ముఖ్య కారణం నాయకత్వలోపం ......... ప్రజలు ఎప్పుడూ మంచివారే !

ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేవు. మంచినీరు, పోషకాహారం, అందరికి సమాన విద్య అవకాశాలు, ఆరోగ్య సేవలు కల్పించబడలేదు. కుల, మత, ప్రాంత, జాతి, వర్గ, లింగ భేధాలతో విభజించి, పాలిస్తూ మన ఓట్ల ద్వారా అధికారాన్ని పొందిన మన నాయకులు ఎంత అవినీతి పరులో, నైతిక విలువలకు ఎలా తిలోదకాలు ఇచ్చారో తెలుసుకోవటానికి ప్రయత్నించే అవకాశం కూడా ప్రజలకు లేకుండా నిత్యము కులమత సంఘర్షణలతో సతమతం అవుచున్నారు.

ఇలాంటి దుష్ట రాజకీయాల వలన అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి ! జాతీయ పార్టీలు అని చెప్పుకొనే ముఖ్యపక్షాలు కుల, మత, ప్రాంతీయ తత్వాలతో దిగజారిపోయాయి. ఎంతో కొంత జాతీయ దృక్పధం కల్గిన కొన్ని ప్రాంతీయ పార్టీల పైపు మొగ్గు చూపటం, ప్రజలకు న్యాయంగా తోస్తోంది. నూట ఇరవై అయిదు సంవత్సరాల వయస్సు కల్గిన పార్టీ అని ప్రచారం చేసుకొంటూ, అత్యధిక కాలం అధికారంలో వుండి, ఇటువంటి దుర్భరస్థితికి కారణమయింది ఒక పార్టీ ! ఇంతటి వయస్సు, అనుభవం అని చెప్పుకొనే ఈ పార్టీకి పునాదులు లేవు. కొద్ది నెలలు వయస్సు కల్గిన ప్రాంతీయ పార్టీలతో కూడా పోటీపడలేక, చతికిల పడిన సంఘటనలు అనేకం ! ఒకప్పటి దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన అసలైన ఆ కాంగ్రెస్ పార్టీ లక్షణాలు, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో ఒక్క శాతం కూడా లేవు ! 1969లో ఇందిరా కాంగ్రెస్‌గా విడిపోయి తర్వాత అసలైన కాంగ్రెస్ పార్టీ పేరును దొంగిలించి, అఖిల భారత కాంగ్రెస్ పార్టీగా చెలామణి అవుతున్నారు. ప్రజలను మభ్యపరుస్తున్నారు. ప్రలోభాలతో లొంగదీస్తున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు నాంది పలికారు ! అన్ని  వ్యవస్థలను ఒక పధకం ప్రకారం నిర్వీర్యం చేసారు అభివృద్ధిని కుంటి పరిచారు. దేశ సమగ్రతకు ముప్పు తెచ్చారు. దేశంతో పాటు సొంత పార్టీని కూడా నాశనం చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను యాచకులుగా మార్చారుబీ సంక్షోభాన్ని సృష్టించారు.

రాజ్యాంగాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, స్వార్ధ ప్రయోజనాలకు, అధికారం నిలబెట్టుకొనుటే పరమావధిగా, చట్టాలను, విధానాలను తమకు అనుకూలంగా మలుచుకొన్నారు. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవాలలో కొద్దిమంది అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, బడి పిల్లలు తప్ప సాధారణ ప్రజలలో ఏమాత్రం స్పందన కనిపించదు. స్వాతంత్ర్య ఫలాలు సామాన్య ప్రజలకు చేరకపోవటం ఈ పరిస్థతికి. ముఖ్య కారణం, కొద్దిమంది అమాయక ప్రజలు స్వాతంత్ర్యం అంటే అదొక వస్తువుగా పరిగణించి, ఢిల్లీలో ఒక ఇంట్లో దాచినట్లు భావిస్తున్నారు! అందుకే రెండవ స్వాతంత్ర్య పోరాటం అంటూ ప్రజలు స్పందిస్తున్నారు.

ఈ అసమర్థ అవినీతి పరిపాలనలో ప్రతిరోజు భారీ కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. గత కొద్ది సంవత్సరాల నుండి దేశంలో సంపదను సృష్టించకపోగా, సహజవనరులను కూడా కొల్లగొట్టి జేబులు నింపుకొన్నారు. ఇవన్నీ పరికిస్తూ ప్రజా ప్రతినిధులు, ముఖ్యంగా మంత్రులు, శాసన సభ్యులు, లోక్ సభ సభ్యులు కొంతమంది చదువుకొన్న మూర్ఖులు మేధావులు అనబడేవారు తమకు సంబంధం లేనట్లు సమాజంలో తిరుగుతున్నారు. ఈ 'వి'నాయకులందరూ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఈ అరాచకాన్ని సమర్ధించినట్లే. ఈనాడు ప్రధానమంత్రి సయితం నేను ఎవరి వద్ద డబ్బు తీసుకొనటం లేదు అని ప్రతి రోజు ప్రకటించుకొనే దుస్థితి దాపురించింది. ఇట్టి అసాంఘిక, అసమర్ధ, దుష్ట పరిపాలనను భారీ కుంభకోణాలను మీడియా వారు, సామాజిక స్పృహ కల్గిన మేధావులు, తదితర దేశాభివృద్ధిని కాంక్షించే దేశభక్తులు ఎంతో వ్యయప్రయాసలతో తమ ప్రాణాలొడ్డి బయటపెట్టడం గమనార్హం ! ప్రభుత్వం వద్ద పూర్తి సమాచారమున్నా, ఏ విధమైన చర్యలు తీసుకోకుండా గత కొన్ని సంవత్సరాలుగా నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రవర్తించి. తాత్సారం చేయటానికి ముఖ్యకారణం ఇందులో ప్రభుత్వంలోని వారందరి పాత్ర, ప్రమేయం ఉండటమే.

అవినిరోధక శాఖలు ప్రభుత్వ పరిధిలో (నియంత్రణలో) పని చేస్తున్నాయి. అందుకే అవినీతి కార్యక్రమాలను నిరోధించడంలో వారి పాత్ర పరిమితమైంది. 60 ఏళ్లకు పైగా అవినీతి కార్యకలపాలలో కూరుకుపోయిన రాజకీయ నాయకులను, అధికారులను ఏ విధంగాను శిక్షించలేకపోయాయి.

రాజ్యాంగ ప్రతిపత్తితో సర్వస్వతంత్రంగా నిర్వహింపబడు న్యాయ స్థానాల పాత్ర ఇందుకు భిన్నమయింది. ప్రభుత్వ ప్రభావము లేకుండా న్యాయమైన తీర్పు చెప్పగలవు. అనేక పరిస్థితుల్లో దేశానికి నిర్భయంగా న్యాయాన్ని అందించి అనేక అక్రమాలను బయటపెట్టగలిగింది. కానీ న్యాయ వ్యవస్థ దేశాన్ని పరిపాలించలేదు పూర్తిగా అస్తవ్యస్తమైన ప్రస్తుత పరిపాలనలో ఎంతో నిజాయితీని ప్రదర్శిస్తున్న న్యాయ వ్యవస్థలు, న్యాయ మూర్తుల పాత్ర కూడా పరిమితమవుతుంది. దీనికి గల కారణాలు అనేకం, తీర్పులు అమలు చేయుటలో విపరీతమైన జాప్యం, తీర్పు యెక్క స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక పర్యావసానాలను లోతుగా విశ్లేషించి తదనుగుణంగా ప్రభుత్వాల మీద ఒత్తిడి చెయ్యగలిగే పరిజ్ఞానం సామాన్య ప్రజలలో లోపించడం, తరచుగా కీలకమైన పత్రాలు మాయం చేయటంలో అవినీతి అధికారులు, మంత్రులు సహకరించటం మున్నగునవి కొన్ని మాత్రమే. అన్ని రంగాలలో నైతికత లోపించుట అత్యంత ముఖ్యకారణం. ఈ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయటకు 1966 నుండి ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

***<u>నైతిక విలువలు పతనం:-</u>*** అన్ని రంగాలలోను అసమర్ధత-అవినీతి, స్వార్ధం తాండవమాడుతోంది. ఈ కారణంగా నైతిక విలువలు పూర్తిగా పతనమైపోయాయి. జవాబు దారీతనం ఎక్కడా కనిపించదు. న్యాయ వ్యవస్థలో కూడా ఈ జాఢ్యం వ్యాపించింది. ఇది దేశ పతనానికి ముఖ్య సంకేతం ఉన్నత న్యాయ స్థానాలలో కొద్ది మంది నిజాయితీ పరులైన న్యాయ మూర్తులు ఇప్పటికి ఉండటం....... ఈ దేశం కొన ఊపిరితో జీవించటానికి కారణంగా కనిపిస్తున్నది!

గాడాంధకారంలో....ఆశాకిరణాలులా కొన్ని ప్రాంతాలలో మంచి స్పందనలు కనిపిస్తున్నాయి. గుజరాత్, బీహార్ లాంటి రాష్ట్రాలలో నాయకత్వ పటిమ చూపి అభివృద్ధిని సాధిస్తున్నారు. దేశానికి, రాష్ట్రానికి నీతి, సామర్ధ్యం గల నాయకులను ఎన్నుకొని అంతా అధిష్టానమే చూచుకొంటుంతనే బానిసత్వ నాయకులను కనుమరుగు చేయాలి.

వైద్య రంగాలలో కూడా ప్రజలకు విలువైన వైద్యం లభించటంలేదు ఆరోగ్య శ్రీ అనే పధకాలు ప్రవేశపెట్టి, కార్పరేటు సంస్థలు, ప్రభుత్వం- భీమా సంస్థలు..... దోపిడీ చేస్తున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలను మెరుగుపర్చి సమస్త ప్రజలు-ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర ప్రతిపత్తి గల సంస్థలు-సమస్త సిబ్బంది తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులలోనే వైద్యం చేయించుకోవాలి. ఆరోగ్య శ్రీ అనే భూటకపు పధకాలకయ్యే ఖర్చు ప్రభుత్వాసుపత్రుల ఆధునీకరణకు వెచ్చిస్తే సమస్త పేద, ధనిక ప్రజలందరకు సమాన అవకాశాలు లభించడమేకాక అత్యాధునిక వైద్యసేవలు ఉచితంగా అందరికి అందుబాటులో సాధ్యం అవుతాయి. సమర్ధులైన వైద్య సిబ్బందిచే నిర్వహింపబడుతాయి. రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్థంగా వుండి ముఖ్యమంత్రి సయితం అంతా అధిష్టానమే చూసుకొంటుంది అనే మంత్రం జపించటం

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం కాదా.

ప్రతి పౌరుడు స్వంత నైపుణ్యాన్ని పెంచుకొని పట్టుదలతో... ఆత్మగౌరవంతో కష్టపడి సంపదను సృష్టించి దేశాభ్యున్నతికి తోడ్పడే ప్రయత్నంలో కలిగే అమూల్యమయిన సంతృప్తిని పొందగలగాలి. డబ్బు కూడబెట్టటం మాత్రమే ఏకైక లక్ష్యంగా చేసుకొని డబ్బు-బానిసత్వానికి లోనై దేశ సంపదను - భవిష్యత్తును - కుదువపెట్టిన వారు కొద్దిమందయినా రాత్రికి జైలు, ప్రొద్దున్న బైలు వ్యవహారాలలో మునిగి తేలుతున్నారు. అసంతృప్తితో, నిత్యం భయంతో జీవిస్తున్నారు.

***అధికారుల అసమర్ధత-అవినీతి:-*** ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న అధికారుల (ముఖ్యంగా......అఖిల భారత సర్వీసుల్లో ఉన్నవారు) పూర్తి అసమర్ధత, అవినీతి బట్టబయలయింది. రాజకీయ నాయకులు అవినీతి పరులు కావటానకి, సమాజంలో నైతిక విలువలు పూర్తిగా దిగజారిపోవటానికి కారణం వీరే ! ఈ సర్వీసులు 19వ శతాబ్దంలోని అవసరాలకు అనువుగా బ్రిటిష్ వారు నిర్మించుకొన్నవి. కాలం చెల్లినవి. ప్రస్తుతం సమాజంలో మరియు గత శతాబ్దంలో సంభవించిన విప్లవాత్మక శాస్త్ర విజ్ఞానం, సరిపడా అనుభవం గల శాస్త్రవేత్తలను, మేధావులను నిపుణులను ఈ కీలక పదవులలో నియమించాలి ఈ సర్వీసులు నియామకాల నిబంధనలు సమూలంగా మార్చి ప్రస్తుత అఖిల భారత సర్వీసులు వెంటనే రద్దు చేయాలి.

అవినీతి అగ్ని గోళం చుట్టుముట్టినప్పటికి, కొంతమంది న్యాయమూర్తులు దేశభక్తితో, ధైర్యసాహసాలతో విప్లవాత్మక తీర్పులు వెలువరిస్తూ, ఈ సమాజానికి ఆశా కిరణాలుగా మిగిలి ఉండటం గమనార్హం. సామాజిక స్పృహ, ఆత్మగౌరవం ఉన్న ప్రజలు, మేధావులు మరియు విద్యావంతులు ఇట్టి అనిశ్చితి, ఏకపక్ష నిర్ణయాలకు ఆలవాలమైన ప్రభుత్వం కల్పించే ఉన్నత పదవులు అధిష్టించటానికి అంగీకరిస్తారా? అంగీకరిస్తున్నారంటే వారి నైజాన్ని, నైతికతను శంకించవలసిందే కదా !

***ప్రస్తుతకర్తవ్యం:-*** మేధావులు-వివేకవంతులు-సామాజిక సృహ కల్గిన వివేక వంతులు-మీడియా ప్రతినిధులు వెంటనే స్పందించి దేశ రక్షణకు పూనుకోవాలి ! ప్రతి పౌరుడూ రోజుకు రెండు గంటలు సమాజ ఉద్దరణ కార్యక్రమాలకు తన వంతు కృషి చేయాలి.

సమాజంలో ఏ తప్పు జరిగినా సరిచేయాటానికి ప్రయత్నించి సంబంధిత అధికారులను పౌరులను అప్రమత్తం చేయాలి ! “రాజకీయాలు నాకు వద్దు” అనే శుష్కవాదాన్ని వదిలిపెట్టక పోతే, ముందు రాబోయే ఉప్పెనలో అందరూ మునిగి పోవటం ఖాయం ! అందుబాటులో వున్న ప్రజలందరకు రాజకీయ పరిజ్ఞానం కల్గించి, ఓటు విలువను గుర్తించేలా చేయాలి ! దుష్ట రాజకీయాలను నడిపేవారిని అక్రమాస్తులను ప్రోగుచేసే వారిని వెలివేయాలి ! సభలలో సమావేశాలలో వారిని బహిష్కరించాలి ! ఏ రకమైన ఉత్సవాలలో....... వివాహాది శుభకార్యలలో వారితో పాల్గొనకూడదు.

కష్టపడి జీవనోపాధిని పొందేవారు దేశ సంపదకు తోడ్పడతారు. కృషి, పట్టుదల, నైపుణ్యతతో ... ఆత్మ గౌరవం(సంపద) ఆత్మస్థైర్యాన్ని పెంచుకొని, ఏ సమస్యలయినా స్వయంగా ఎదుర్కొని-పరిష్కరించే శక్తిని పొందగలుగుతారు. ఇంత గందరగోళ సమాజంలో కూడా కష్ట పడేవారికి..... రెండు పూటలా భోజనానికి లోటువుండదు అమూల్యమయిన తృప్తి లభిస్తుంది(స్వఅనుభవం) డబ్బుకు బానిస కాకుండ డబ్బునే బానిసను చేసుకోవాని ! మనకు సంభవించే ఆపదలకు, ఆనందాలకు మనమే భాద్యులమని గుర్తెరిగి మరిఒకరి మీద భారం వేసే తత్వం వదిలిపెట్టాలి మత మౌఢ్యం నశించాలి! స్వంతంత్రంగా ఆలోచించుకొని

ఏది మంచిదయితే అది చేయాలి. మూఢభక్తి-మూఢవిశ్వాసాలు మన దేశం వెనుక బడటానికి నిదర్శనాలు మన దేశంలో జరుగుతున్న దోపిడీ వ్యవస్థకు, రాజకీయాలకు ఎదురు తిరిగి, మనలను కాపాడుకోవటానికి ఇదే ఏకైక మార్గం! నిజాన్నె నమ్మాలి! మతాన్ని కాదు అంటే ప్రజలలో శాస్త్రీయ ఆలోచన-విశ్లేషణ, జ్ఞానం కల్గాలి. అపుడే మంచి పరిపాలనే కాక స్వపరిపాలన సాధ్యం అవుతుంది! మన దేశానికి నిజాన్ని బహిర్గతం చేయగల శక్తి సామర్ధ్యాలను సమకూర్చాలి.

సమస్యలన్నీ తీరుతాయి. ఈ మార్పును శాస్త్రీయ పద్దతిలో, సకాలంలో సాధించలేకపోతే...రక్త సిక్త విప్లవం ద్వారా సాధించవలసి వస్తుంది.

ప్రస్తుతం......ఆధునిక దేశాలుగా అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణింపబడే అమెరికా, ఐరోపా, జపాన్, చైనా, రష్యా మున్నగునవి ఇటువంటి విప్లవమే సంభవించి మార్పులకు నాంది పలికాయి. అలా జరగపోతే..... అనతి కాలంలోనే విదేశీ పాలనలోనికి పోయి శాశ్వత బానిసత్వ జీవితం తప్పదు. ◆

# ఆడపిల్ల అంటే వివక్ష ఎందుకు?

- ఎన్. సరోజాదేవి

ఆకాశంలో సగం, అవకాశాల్లో సగభాగం అంటూ మహిళా సాధికారతను పెంపొందించుకుంటున్న ఈ నవయుగంలో, మృగాల కన్నా అతి క్రూరంగా.... భార్యగర్భంలో వున్నది ఆడశిశువు పిండం అని తెలియగానే, "ఆడపిల్లల భ్రుణహత్యలు' చేస్తున్న భర్త, అత్తగారు, ఆడపడుచుల్ని ఏం చేయాలి? వారి పైశాచికత్వానికి అంతమెప్పుడు?

పూర్వకాలంలో అయితే... ఒక స్థాయి వరకూనే ఆడపిల్లలకి చదువు చెప్పించి, సాంప్రదాయబద్ధమైన సంబంధం వస్తే, తప్పనిసరి అయితే తమ శక్తికి మించి అయినా కట్నకానుకలు ఇచ్చి, పిల్లపెళ్ళి చేసి అత్తవారింటికి పంపించడం జరిగేది. అత్తింటి ఆరళ్లు ఏమున్నా, కూతురితో సమానంగా ఇంట్లో కోడల్ని చూసుకునే పరిస్థితులు అప్పుడు వుండేవి.

కాని ఈనాడు అలా కాదు, మహిళల్లో పట్టుదల పెరిగింది. దేనినైనా సాధించాలనే ఆరాటం పెరిగింది. అందుకే మగవానితో సమానంగా, అంతకంటే ఇంకా ఎక్కువగా చదువుల్లో కాని, ఉద్యోగ అవకాశాల్లో కాని, ఆర్థిక - సామాజిక-రాజకీయ రంగాల్లో కాని అన్నింటా ముందంజలో వుంటూ వస్తున్నారు.

అటువంటిది "ఆడపిల్ల అయితే భారం, మగపిల్లవాడు ఇంటికి ఆధారం అనే మూఢనమ్మకాలతో కొందరు తమ తమ కుటుంబాల్లో ఎన్నో ఆకృత్యాలకు పాల్పడు తున్నారు. పుట్టినది ఆడపిల్ల అని వినగానే కాని, కడుపులో పడ్డది ఆడపిల్ల బీజం అని తెలియగానే కాని.... "వాళ్లు ఇంటికి పెనుముప్పు అనో, వాళ్లకి కట్నాలు ఇచ్చి పెళ్లిళ్ళు చేయాల్సి వస్తుందనో, ఆడపిల్ల ఏ పనికి పనికిరాదనో" విపరీత భావనలు ఏర్పర్చుకుని, పసిమొగ్గగా వుండగానే ఆ ఆడపిల్లని బ్రతకనివ్వకుండా ఇటువంటి ఘోరాలు తలపెడుతున్నారు. అది ఎంతటి నేరమో ఆ పెద్దలకి తెలిసేలా వెంటనే శిక్షలు అమలు చేసే వారికి బుద్ధి చెప్పాలి.

"ఆడపిల్ల వద్దు - మొగపిల్లవాడే కావాలి" అనుకుని చేస్తున్న ఆడపిల్లల హత్యలపై గాని, సమాజంలో జరుగుతున్న ఆడపిల్లల అత్యాచారాలపై గాని, దాడులపై గాని, గృహ హింసలపై గాని... మహిళాసంఘాలు, పౌరసమాజం ఎంత పోరుపెట్టి ఉద్యమాలు చేస్తున్నా, ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందించి నివారించడం లేదు. అయితే, ఒక్కోదానికి ఒక్కో చట్టం వుంది. చట్టాలు న్నాయని గర్వంగా చెప్పుకోవడానికే కాని.. అవి అమలు అయ్యేటప్పటికి ఏళ్లేళ్ళు కాలగర్భంలో కలిసిపోవల్సిందే.

రాజకీయ నాయకులందరూ, ఎన్నికల్లో ఓట్లు కోసం మాత్రమే ప్రజల ముందు చేతులు జాస్తారు తప్పిస్తే... గెలుపొందేక వారి పరిపాలన ప్రజల ఇంటి ముందుక్కూడ వెళ్ళడం లేదు. ఇక నుండి అయినా ఎమ్మెల్యేలు, ఎంపీలు



## మగబిడ్డ కోసం అత్తింటి ఘాతుకం

ఈమె పేరు మున్నీ. ఏడో కాన్పులో మగసంతానం కలుగుతుందని ఓ బాబా చెప్పిన జోస్యాన్ని నమ్మి అత్తింటి వారు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఈ వివాహితను చిత్రహింసలు పాలు చేసిన వైనంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మున్నీకి తొలి మూడు కాన్పుల్లో అమ్మాయిలే పుట్టారు. మూడోబిడ్డ పసికందుగా ఉన్నప్పుడే మరణించింది. నాలుగు అయిదు గర్భాలను ఆడపిల్లని తెలుసుకుని అత్తింటి వారు గర్భస్రావం చేయించారు. ఆరో గర్భాన్ని అలాగే చిదిమేశారు. పిండాన్ని తీసివేసినా కడుపులో ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఆమె ప్రాణాపాయ స్థితిలో తెనాలి అసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల జరిగిన ఈ సంఘటనపై శాసనసభ స్పీకర్ మనోహర్ స్పందించారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తమ తమ కుర్చీల భద్రత కోసం పోట్లాడుకోవడం మానుకుని, ఇకపై పూర్తిగా ప్రజల బాగోగులు పట్టించుకుని, ప్రజల అవసరాలు తీరుస్తూ, ముఖ్యంగా సమాజంలో సమస్యలను ఎదుర్కొనే స్త్రీలకు ఆలవాలమై, వెన్నుదన్నుగా వుండే రాష్ట్ర మహిళా కమీషన్‌ను పునరుద్ధరించి, ... "ఆడపిల్ల దేశానికే వెన్నుముక" అని తెలియచెప్పే విధంగా, ఆడశిశువుల భ్రూణహత్యలు వంటివి ఆగేలా ప్రతి కుటుంబానికి అవగాహన కలిగిస్తూ " ఆదది అంటే అబల కాదు సబల... ఆమే మీకు ఆధారం అనే ధైర్యానివ్వాలి.

నిజము అంతే! ఈనాటి కాలంలో మగపిల్లల కన్నా ఆడపిల్లలే ఎంతో నయం. తల్లి - తండ్రులు ఒంటరిగా వుండిపోతారని తెల్సి కూడా మొగపిల్లలు పై చదువులు, ఉద్యోగావకాశాలు అంటూ విదేశాలకు వెళ్ళిపోవడం, అక్కడే స్థిరపడిపోవడం జరుగుతుంది. ఒకవేళ ఇండియాలోనే వుండిపోయినపిల్లలున్నట్లయితే... వాళ్ళల్లో కనీసం కొంతమంది అయినా, వారి తల్లి - తండ్రులను చూసుకునే ఓపిక లేనట్టు, కాలానుగుణ పరిస్థితుల వంకతో, వాళ్లని "వృద్ధాశ్రమాల్లో" చేర్పించడమో, భార్యతో వేరుకాపరం పెట్టడమో అన్నది కూడా చూస్తున్నాము.

ఆడపిల్లలైతే వారిని అలా గాలికి వదిలేయలేక.... తమని పెంచి - పెద్ద చేశారన్న కృతజ్ఞతతో, తల్లి - తండ్రులని కూడా బాధ్యతగా చూసుకోవడం జరుగుతుంది.

(వివాహం అయిన కారణంగా కొందరు, చదువులరీత్యా కొందరూ విదేశాలకు వెళ్లిన వారిలో ఆడపిల్లలు లేరని కాదు.)◆

# 121 మంది అవినీతి పరులకు భారీ జరిమానా విధించండి

## కేంద్ర విజిలెన్స్ కమీషన్ సిఫారసు

■ **సీవీసీ సిఫారసు**

అవినీతికి పాల్పడిన 121 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై భారీ జరిమానాలను విధించాలని కేంద్ర నిఘా సంస్థ ( సీవీసీ) సంబంధిత విభాగాలకు సిఫారసు చేసింది. ఆ 121 మందిలో అత్యధికంగా భారతీయ స్టేట్ బ్యాంకు నుంచి 16 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ వివరాలు సీవీసీ తన జనవరి నెల నివేదికలో పేర్కొంది. సీవీసీకి చెందిన ముఖ్య సాంకేతిక పరిశోధన విభాగం ... ప్రభుత్వ విభాగాలు చేపట్టే వివిధ పనులను పర్యవేక్షించడం ద్వారా జనవరిలో రూ. 2.25 కోట్లను రికవరీ చేసింది. మొత్తం 394 కేసులను పరిశీలించిన సీవీసీ 88 మంది అధికారులపై నామమాత్రపు జరిమానా విధించింది. 49 అధికారులపై పరిపాలనా చర్యలు, హెచ్చరికలు, మందలింపు వంటి చర్యలను సిఫారసు చేసింది. 136 కేసులను కొట్టివేసింది.

బీఎస్ఎన్ఎల్, భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, చమురు మంత్రిత్వశాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రవాస భారతీయుల వ్యవహారాల శాఖల నుంచి అవినీతికి పాల్పడినట్లు తేలిన ఒక్కొక్క అధికారికి భారీ జరిమానాలను విధించాలని సూచించింది. ✶

**జరిమానా విధింపునకు గురైన ఉద్యోగులు సంస్థల వారీగా....**

| సంస్థ | ఉద్యోగుల సంఖ్య |
|---|---|
| రైల్వే | 15 |
| విద్యుత్‌శాఖ | 15 |
| కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ విభాగం | 11 |
| విజయా బ్యాంకు | 11 |
| కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం | 05 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 05 |
| అలహాబాద్ బ్యాంకు | 04 |
| పంజాబ్ నేషన్ బ్యాంకు | 04 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్, జైపూర్ | 04 |
| ఈపీఎఫ్ సంస్థ | 04 |
| ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ | 04 |
| ఇండియన్ బ్యాంకు | 03 |
| వాణిజ్య మంత్రిత్వశాఖ | 02 |
| సిండికేట్ బ్యాంకు | 02 |

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**గౌడిశలపల్లి :** సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు బి.బాబు విమర్శించారు. గౌడిశలపల్లిలో ఆయన గ్రామస్తులతో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. రైతుకు ఆదాయ భద్రత, ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మునుపెన్నడూ లేని రీతిలో ఈ సారి ఉప ఎన్నికల ఫలితాలు వస్తాయన్నారు. అవినీతి లేని పాలన కోసం లోక్‌సత్తా చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు నాగరాజు, ఈశ్వరరెడ్డి, రామాంజి, వెంకటరెడ్డి, సిద్ధేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## అనంతపురం

### ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలి

**రాయదుర్గం :** ఎఫ్‌పీ షాపుల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా తాలూకా అధ్యక్షుడు బి.బాబు డిమాండ్ చేశారు. రాయదుర్గం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఆంజనేయులు ఆధ్యక్షతన ఆహార సలహా సంఘ సమావేశం జరిగింది. 19 మంది సభ్యులకు గాను అధికారులతో సహా కేవలం ఆరుగురు హాజరయ్యారు. బీజేపీ తరపున జయంతి సురేష్, లోక్‌సత్తా బీ.బాబు, సీపీఎం మల్లీకార్జున హాజరయ్యారు. కిరోసిన్ ఏజెంట్ తాయి శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, సీఎస్‌డీటీ అప్జల్‌ఖాన్ వచ్చారు. ఆర్డీఓ అధ్యక్షతన జరగాల్సిన సమావేశానికి ఆర్డీఓనే గైర్హజరయ్యారు. లోక్‌సత్తా తాలుకా అధ్యక్షుడు బి.బాబు మాట్లాడుతూ సర్వే పేరిట తొలగించిన రేషన్‌కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సభ్యులతో కలిపి ఎఫ్‌పీ షాపులను తనిఖీ చేస్తే వాటి పనితీరు మెరుగవుతుందన్నారు. పండుగ సమయాల్లో అదనపు కోటా వేయాలని కోరారు. తహశీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ సీఎస్‌డీటీ ప్రతి నెల చౌక డిపోలను తనిఖీ చేస్తారని, డీలర్ల అక్రమాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సరుకులు నాణ్యతగా లేకపోతే వెనక్కి ఇవ్వొచ్చన్నారు. గత నెలలో కో-అపరేటివ్ సెంట్రల్‌స్టోర్స్ పరిధిలోని డిపో నంబర్ 2,4,6లను తనిఖీ చేసి, డిపో ఆరుపై రూ.వెయ్యి అపరాధ రుసుం విధించామని, మిగిలిన రెండింటిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### దాహం తీర్చడంలో ప్రభుత్వం విఫలం

**రాయదుర్గం :** ప్రజల దాహం తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లోక్‌సత్తా పార్టీ తాలూకా అధ్యక్షుడు బి.బాబు పేర్కొన్నారు. మండలంలోని జుంజురంపల్లి ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. తాగునీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కిలోమీటర్ దూరం వెళ్లి వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి కాలనీ వాసులకు దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైన నీటి సమస్యను పరిష్కరించకుంటే ఎమ్పీడివో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా జరగనున్న ఉప ఎన్నికల్లో ధనరాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యానికి బానిసలు కావద్దని పిలుపునిచ్చారు.

**రాయదుర్గం:** మార్చి 28వ తేదీన పమిడిలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు డా॥ జె. శ్రీనాథ్ గారి ఆధ్వర్యంలో పమిడి శాఖ వారు, రైతులచే ఒక ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వో ఆఫీసు వరకు ర్యాలీగా వచ్చారు. చాలా కాలంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని త్వరగా పాసుపుస్తకాలను పంపిణీ చేయాలని డా॥ శ్రీనాథ్ ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఒకవారం లోపల పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డా॥ జె. శ్రీనాథ్‌తో పాటు, కార్యదర్శి వన్నూరప్ప, కోశాధికారి ఇస్మాయిల్ గుంతకల్లు నుంచి ఎం.డి. గౌస్, జిల్లా క్రమశిక్షణ సభ్యులు రామసుబ్రమణ్యం, జిల్లా ఎన్నికల కమీషన్ సభ్యులు రాయప్ప, పమిడి నుండి ఇమాములు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా ఫూలేకు ఘనంగా నివాళులర్పించిన లోక్‌సత్తా, సర్వజనసత్తా

**హైదరాబాద్ :** సమాజంలోని అన్ని అసమానతలు తొలగి, అందరికీ సమానావకాశాలు రావాలంటే విద్య ఒక్కటే మార్గమని గట్టిగా ప్రబోధించిన మహాత్మాపూలే స్ఫూర్తిని జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. మహాత్మాపూలే జయంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పూలే చిత్రపటానికి జేపీ, పార్టీ నేతలు దండలువేసి నివాళులర్పించారు. పూలేను స్మరించుకోవడమంటే సమాజంలో ప్రతిఒక్కరూ చదువుకుని తమ కాళ్ళమీద తాము నిలబడి, దేశానికి దన్నుగా మారడమేనని జేపీ అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు డివియస్ వర్మ, లక్ష్మణ్ బాలాజీ, కటారి శ్రీనివాసరావు, 'సర్వజనసత్తా' రాష్ట్ర అధ్యక్షుడు ఈద చెన్నయ్య, ఉపాధ్యక్షుడు పగడాల వెంకటేశ్వరరావు, చింతల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు గుర్తుల కేటాయింపులో ఈసీ నిర్ణయం సరైనదే

గుర్తింపులేని నమోదైన రాజకీయ పార్టీలకు శాశ్వతంగా ఒకే గుర్తు కేటాయించలేమంటూ ఎన్నికలు సంఘం (ఈసీ) తీసుకున్న నిర్ణయం సుప్రీంకోర్టు సమర్థించింది. జస్టిస్ ధర్మాసనం 2:1 మెజారిటీతో ఆమోదం తెలిపింది. ఇందులో జస్టిస్ చలమేశ్వర్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. గుర్తుల కేటాయింపుపై ఈసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాజకీయ పక్షాలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై ధర్మాసనం ఆదేశాలిచ్చింది. గతంలో ఇచ్చిన ఈసీ ఆదేశాల ప్రకారం... ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 5% ఓట్లు సంపాదించిన పార్టీ లేదా కనీసం 2 అసెంబ్లీ సీట్లుగానీ, ఒక పార్లమెంటు సీటుగానీ గెలిచిన పార్టీకి శాశ్వత గుర్తును కేటాయిస్తామని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల్ని సవాలు చేస్తూ, ప్రజారాజ్యం, బహుజన్ వికాస్ అఘాది, దేశీయ మురుపొక్కు ద్రవిడ కజగం తదితర పార్టీలు 2008లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. వీటిని తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం... ఇందులో కోర్టు జోక్యం చేసుకోలేదని వ్యాఖ్యానించింది. ఓటర్లలో గందరగోళం తొలగించేందుకు శాశ్వత గుర్తులు ఉండాల్సిందేనన్న వాదననూ తిరస్కరించింది.

## చిలకలూరిపేటలో

### విద్యుత్ కోతలపై నిరసన

విద్యుత్ సరఫరా సక్రమంగా చేయలేని ప్రభుత్వానికి ఛార్జీలను పెంచే అధికారం లేదని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్ విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు, విద్యుత్ కోతలకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో ఎన్ఆర్టీ సెంటర్‌లో జాతీయ రహదారిపై కంప్యూటర్‌లు, విద్యుత్ బల్బులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి కొద్దిసేపు ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రకటించిన సమయాల కన్నా అనధికార విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయన్నారు. అనధికార విద్యుత్ కోతలను తగ్గించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, కామినేని ఆంజనేయులు, రజాక్, రియాజ్, సిద్ధిక్, కమల్, నాగూర్‌షరీఫ్, ఫణి, బాబు, శ్రీనివాసరావు తదితరులు

## గుంటూరులో

### లోక్‌సత్తా పార్టీ ఆర్థిక నివేదిక

**నరసరావుపేట :** ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను లోక్‌సత్తా పార్టీ విడుదల చేసినట్లు పట్టణ పార్టీ అధ్యక్షులు ఈదర గోపీచంద్ తెలిపారు. స్థానిక ఆరండల్ పేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి ఈదర గోపీచంద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు కార్యకర్తల సభ్యత్వ రుసుము, ప్రజల-వదాన్యుల విరాళాలతో సేకరించిన ప్రతి రూపాయికి లెక్క రాశామని జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పాటించాల్సి ఉందని, ఈ విధానం అనుసరించి మార్చితో అంతమయ్యే ఆర్థిక సంవత్సర నివేదికను ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు. రూ॥2,02,810ల లావాదేవీలు జరిగాయని, రూ॥32,430లు సభ్యత్వ రుసుంగా వచ్చిందని, రూ॥86,100లు విరాళాలు సేకరించి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపామని తెలిపారు. దాదాపు రూ॥70వేలు వివిధ పార్టీ కార్యకలాపాలకు వెచ్చించామని తెలిపారు. త్వరలో 5 మున్సిపల్ వార్డులలో కమిటీ సమావేశాలు నిర్వహించి, ఆయా వార్డులు సమస్యలపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు ఆళ్ళ సుబ్బారెడ్డి, టి. సాంబశివరావు, చుండూరు సత్యనారాయణ, బాల భాస్కర్, హనుమంతరావు, నిర్మలా బోస్ తదితరులు పాల్గొన్నారు.

Courtesy

# The Electoral Systems of the World




ప్రపంచంలోని వివిధ దేశాలలో అమలులో వున్న ఎన్నికల పద్ధతులు - వివరాలు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12

# రాబర్ట్ క్లిట్‌గార్డ్

## ( ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త )



## మీరూ... ఆలోచించండి......

"ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో
ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో
ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో
ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా
'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చేస్తుంటారో
అక్కడ
వ్యవస్థకు సంబంధించిన పునఃసమీక్షకు
సమయం ఆసన్నమైందని అర్థం
అప్పుడు
తమ గురించి, తమకు సంబంధించినవారి గురించి
తమ చుట్టూరా వున్న వారి గురించి
తమ కార్యకలాపాలకు సంబంధించి
అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"

When in a society the shameless triumph;
when the abuser is admired,
when principles end and only opportunism prevails;
when the insolent rule and the people tolerate it;
when everything becomes corrupt but the majority is silent....
When so many "whens" unite, perhaps it is time to hide oneself;
time to suspend the battle; time to stop being a Quixote;
it is time to review our activities, reevaluate those around us,
and return to ourselves.
Quixote;
it is time to review our activities, reevaluate those around us,

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad